సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 07.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 001
పేజీలు: 08 వెల: రూ. 5

పొంచిఉన్న కొత్త ముప్పు?

తనను తానే సృష్టించుకోనున్న ఏఐ

- తనకంటే శక్తిమంతమైన దానినిని తయారు చేసే దిశగా అడుగులు!
- ఏఐ అభివృద్ధి వేగంపై ఆంత్రోపిక్ సంచలన హెచ్చరిక.
- మనుషుల పర్యవేక్షణ దాటితే ఏఐతో భద్రతా ముప్పులు!
- ఏఐతోనే కొత్త ఏఐ రూపకల్పన..
- టెక్ ప్రపంచంలో కలవరం
- ఏఐ వేగాన్ని అందుకోగలరా?
- నియంత్రణపై నిపుణుల్లో ఆందోళన!



2

ఓబీసీ క్రీమీలేయర్‌పై సుప్రీం కీలక తీర్పు



- జీతం ఒక్కటే ప్రామాణికం కాదు
- పాత నియామకాలకు రక్షణ
- 2025 సివిల్స్ అభ్యర్థులకు వర్తింపు
- కొత్త మార్గదర్శకాలు అమలు చేయాలి

2



2

బియ్యం ధరలకు కళ్లెం

సామాన్యులకు సర్కారు భరోసా!

- బియ్యం ధరల నియంత్రణకు సర్కారు చర్యలు
- కిలో బియ్యం రూ.66 నుంచే.. 10 విక్రయ కేంద్రాలు ప్రారంభం
- సామాన్యులకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం
- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ఇంటింటికీ ఇంటర్నెట్


రూ.3,185 కోట్లతో భారీ ప్రాజెక్ట్!

2

- గ్రామీణ ప్రాంతాలకూ డిజిటల్ వెలుగులు..
- కేంద్రంతో తెలంగాణ ఒప్పందం!
- పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతి ఇంటికీ నెట్!
- టీ-ఫైబర్‌తో తెలంగాణలో డిజిటల్ విప్లవానికి శ్రీకారం!

-ముద్ర, తెలంగాణ బ్యూరో:





కట్టుతప్పుతున్న క్రమశిక్షణ

రేవంత్ నాయకత్వానికి సవాల్!

సొంత నేతల తిరుగుబాటుతో రోడ్డున పడుతున్న పరువు

- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు..
- బహిరంగ వేదికలపై ప్రభుత్వంపై విమర్శలు
- రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలతో గాంధీభవన్‌లో ప్రకంపనలు
- మంత్రి దామోదర–ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు వివాదంతో ఢిల్లీ చేరిన రచ్చ
- నోటీసులకు స్పందించకుండా రాని నేతలు
- క్రమశిక్షణ కమిటీ మౌనం..
- నేతలపై చర్యలకు వెనుకడుగు

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా పార్టీలో అంతర్గత విభేదాలకు మాత్రం తెరపడటం లేదు. విపక్షాలను ఎదుర్కోవాల్సిన సొంత పార్టీ నేతలే ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బహిరంగంగా ప్రశ్నిస్తుండటం కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య ఆధిపత్య పోరు రోజురోజుకూ ముదురుతుండగా, జిల్లాల స్థాయి విభేదాలు సైతం రోడ్డెక్కుతున్నాయి. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు అధికార పార్టీలో అసంతృప్తికి అద్దం పడుతున్నాయి. మరోవైపు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంలో టీపీసీసీ నాయకత్వం విఫలమవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉండి కూడా సొంత నేతలను అదుపు చేయలేని పరిస్థితి కాంగ్రెస్‌కు రాజకీయంగా సవాల్‌గా మారుతోంది.

సొంత ప్రభుత్వంపైనే తిరుగుబాటు!

పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, నిధులు, పదవుల కేటాయింపులో అన్యాయం జరుగుతోందని రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సైతం ఆయన వ్యాఖ్యలకు మద్దతు తెలపడమే కాకుండా, తన నియోజకవర్గానికి నిధులు కేటాయించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించడం సంచలనంగా మారింది. అసెంబ్లీ వేదికగానూ, బహిరంగ సభల్లోనూ సొంత ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నేతల సంఖ్య పెరుగుతుండటం పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారింది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు!

జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు మరో స్థాయికి చేరుతోంది. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య ఢిల్లీలో చోటుచేసుకున్న వివాదం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. నామినేటెడ్ పదవులు, జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపిక, ప్రాంతీయ ఆధిపత్యం వంటి అంశాలే విభేదాలకు కారణమన్న ప్రచారం సాగుతోంది. రాష్ట్రంలో పరిష్కరించుకోవాల్సిన సమస్యలు దేశ రాజధానిలో చర్చనీయాంశం కావడం పార్టీ ప్రతిష్ఠకు ఇబ్బందికరంగా మారింది.

క్రమశిక్షణ కమిటీ ఏం చేస్తున్నట్లు?

పార్టీలో క్రమశిక్షణ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాల్సిన టీపీసీసీ నాయకత్వం ప్రేక్షకపాత్రకే పరిమితమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న స్థాయి నేతలపై నోటీసులు, హెచ్చరికలు జారీ చేసే నాయకత్వం.. బలమైన ఎమ్మెల్యేలు, మంత్రుల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలున్నాయి. మిగతా 02లో

బీజేపీలో పొలిటికల్ గేమ్!

ఎమ్మెల్సీ బరిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

గెలిస్తే పట్టు.. ఓడితే పదవికి ముప్పు

- ఎమ్మెల్సీ ఫలితంతో అధ్యక్ష పీఠానికి ఎసరు?
- ఓడితే బండి సంజయ్‌కు పగ్గాలు?
- రామచంద్రరావును రిస్క్‌లోకి నెట్టిందెవరు?
- కమలదళంలో నాయకత్వ మార్పు చర్చలు!
- ఎమ్మెల్సీ ఎన్నికల వెనుక ఢిల్లీ వ్యూహం?
- ఓటమి వస్తే అధ్యక్ష పదవికి గండమేనా?
- ఎమ్మెల్సీ పోరుపై బీజేపీలో ఉత్కంఠ


ముద్ర, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ బీజేపీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ వేడిని పెంచుతున్నాయి. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు స్వయంగా బరిలోకి దిగేందుకు సిద్ధమవడం ఇప్పుడు కమలదళంలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆయన అభ్యర్థిత్వానికి అధిష్ఠానం కూడా సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుండటంతో త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం కనిపిస్తోంది.

అయితే రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉండి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడం రామచంద్రరావుకు కత్తిమీద సామేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన అనుభవం ఆయనకు ఉన్నప్పటికీ, ఈసారి ఫలితం తేడా వస్తే దాని ప్రభావం కేవలం ఆయన రాజకీయ భవిష్యత్తుకే కాకుండా బీజేపీ నాయకత్వంపైనా పడే అవకాశముంది.

అధ్యక్ష పదవికి ముప్పేనా?

రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండే వ్యక్తి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కానీ రామచంద్రరావు స్వయంగా ఎన్నికల బరిలోకి దిగితే ఒక నియోజకవర్గానికే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై రాజకీయ పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన సమయంలో రాష్ట్ర మిగతా 02లో



ప్రజా సమస్యలే ముఖ్యం

తుపాను బాధితులకు చివరి వ్యక్తి వరకు సాయం

సీఎం చంద్రబాబు

2

- వరుస తుపాన్లతో రైతులకు తీరని నష్టం
- పంట నష్టంపై ఏరియల్ సర్వే
- రైతులతో సీఎం మాటామంతీ
- నీటి భద్రతకు అధిక ప్రాధాన్యం
- నల్లమడ డ్రైన్‌కు శాశ్వత పరిష్కారం

తుపాన్ల వల్ల కోస్తా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం.. ఏరియల్ సర్వే నిర్వహించారు. బాపట్ల, గుంటూరు జిల్లాల పర్యటనకు వెళ్తున్న సమయంలో హెలికాప్టర్ ద్వారా పంట నష్టాన్ని పరిశీలించారు. హెలికాప్టర్‌లో సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్లో దిగి.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు చేరుకున్నారు. -ముద్ర, అమరావతి :



ప్రజలకు దీపావళి కానుక

దీపావళి కానుకగా మెట్రో, ఆర్టీసీ పాస్‌ల ధరల తగ్గింపు

- నెలవారీ ఉమ్మడి పాస్‌పై ఏకంగా రూ.4,500 ఆదా.
- రోజువారీ పాస్ ధర రూ.400 నుంచి రూ.275కు తగ్గింపు.
- నవంబర్ 8 నుంచి కొత్త ధరలు అమల్లోకి.. ప్రయాణికులకు ఊరట
- సామాన్యులు, ఉద్యోగులకు ప్రయాణ ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యం.



2

గ్లోబల్ సందడి

- హైటెక్స్‌లో మూడు రోజుల సదస్సు
- 100 దేశాల నుంచి ప్రతినిధులు
- శశి థరూర్ సహా ప్రముఖుల రాక
- అంతర్జాతీయ సంబంధాల బలోపేతమే లక్ష్యం

100 దేశాల ప్రతినిధులతో భారత్ సమ్మిట్

ముద్ర, హైదరాబాద్ :

తెలంగాణ రాజధాని హైదరాబాద్ మరో అంతర్జాతీయ మహోత్సవానికి వేదిక కాబోతోంది. ఈ నెల 12, 13, 14 తేదీల్లో నగరంలోని హైటెక్స్ వేదికగా ప్రతిష్ఠాత్మక 'భారత్ సమ్మిట్' నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ప్రపంచ దేశాల ప్రతినిధుల రాకతో భాగ్య నగరంలో ఇప్పటికే అంతర్జాతీయ వాతావరణం నెలకొంది.

వంద దేశాల నుంచి .. 450 మందికి ప్రత్యేక ఆహ్వానాలు

ఈ అంతర్జాతీయ సమ్మిట్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దాదాపు 100 దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సదస్సు కోసం వివిధ రంగాలకు చెందిన మిగతా 02లో

BHARAT SUMMIT
DELIVERING GLOBAL JUSTICE

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శనివారం, 07 నవంబర్, 2026

అన్నవాహిక రక్షణ పొరకు నష్టం!

నోటి నుంచి ఆహారం కడుపులోకి వెళ్లే అన్నవాహిక లోపలి పొరపై మరీ వేడి పానీయాలు ప్రభావం చూపవచ్చు. పదేపదే అధిక వేడికి గురికావడం వల్ల కణాలు దెబ్బతినడం, వాపు రావడం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. దీర్ఘకాలంలో కణాల్లో అసాధారణ మార్పులకు అవకాశం ఉంటుంది.



సుప్రీంకోర్టు కీలక తీర్పు

ముద్ర, న్యూఢిల్లీ :
ఓబీసీ క్రీమీలేయర్ నిర్ణయంలో తల్లిదండ్రుల జీతం ఒక్కటే ప్రామాణికం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తల్లిదండ్రులు ప్రభుత్వంలో నిర్వహించిన హోదా, పోస్టు కేటగిరీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మార్చి 11, 2026న ఇచ్చిన తీర్పులో పేర్కొంది. అయితే ఈ తీర్పుతో ఇప్పటికే పూర్తయిన ఉద్యోగ నియామకాలు, ఎంపికలు, పదోన్నతులు, సీనియారిటీపై ఎలాంటి ప్రభావం ఉండదని తాజాగా స్పష్టం చేసింది. పాత నియామకాలను తిరిగి తెరవడానికి ఈ తీర్పును ఆధారంగా చేసుకోరాదని పేర్కొంది. దీంతో ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్నవారికి ఊరట లభించింది.
మరోవైపు సివిల్ సర్వీసెస్ పరీక్ష–2025 ద్వారా ఎంపికైన 958 మందికి మాత్రం ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయని తెలిపింది. వారికి ఇంకా సర్వీసుల కేటాయింపు పూర్తికాకపోవడమే ఇందుకు కారణం. మార్చి 11, 2026 తర్వాత చేపట్టే కొత్త నియామకాలు, ఎంపికల్లోనూ తాజా మార్గదర్శకాలను అమలు చేయాలని ఆదేశించింది.
ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో పని చేసే వారి పిల్లల క్రీమీలేయర్ అర్హతను కూడా సమాన హోదా ప్రాతిపదికన నిర్ణయించే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందించుకోవచ్చని పేర్కొంది. మొత్తంగా పాత నియామకాలకు రక్షణ కల్పిస్తూనే, భవిష్యత్తు నియామకాల్లో ఓబీసీ క్రీమీలేయర్ లెక్కింపునకు కొత్త స్పష్టత ఇచ్చింది.

హైదరాబాద్‌లో గ్లోబల్ సందడి

(మొదటి పేజీ తరువాయి)
450 మంది అంతర్జాతీయ ప్రముఖులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపించారు. వివిధ దేశాల దౌత్యవేత్తలు, ప్రతినిధులు సమావేశాల్లో భాగస్వామ్యం కానున్నారు.

హాజరుకానున్న కేంద్ర మంత్రులు,
ఈ సదస్సుకు పలువురు కేంద్ర మంత్రులతో పాటు ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, ఎంపీ శశి థరూర్ కూడా హాజరుకానున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జరుగుతుండటంతో ఈ సమ్మిట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అంతర్జాతీయ సహకారానికి హైదరాబాద్‌ను కేంద్రబిందువుగా మారుస్తూ ఈ సదస్సును ఎంతో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
లక్ష్యం: దేశాల మధ్య సత్సంబంధాల బలోపేతం
వివిధ దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, భాగస్వామ్య సత్సంబంధాలను మరింత పెంపొందించడం, బలోపేతం చేయడమే ఈ 'భారత్ సమ్మిట్' ప్రధాన లక్ష్యం. మూడు రోజుల పాటు హైటెక్స్‌లో జరిగే కీలక సమావేశాల్లో పలు గ్లోబల్ అంశాలు, అంతర్జాతీయ సహకారం , భాగస్వామ్యాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ప్రపంచ వేదికపై హైదరాబాద్ నగరం మరోసారి తన ప్రాధాన్యతను చాటుకునేలా ఈ సదస్సు నిలవనుంది.

ఇంటింటికీ ఇంటర్నెట్

ముద్ర, తెలంగాణ బ్యూరో:
తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. కేంద్ర ప్రభుత్వపు అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్రంలో రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేసేందుకు కేంద్రంతో ఒప్పందం పూర్తయింది. ఢిల్లీలోని సంచార్ భవన్‌లో జరిగిన తొలి బోర్డు సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.
ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,185 కోట్ల భారీ నిధులు సమకూరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'తెలంగాణ రాష్ట్ర రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్' (TRRIIC)ను ఏర్పాటు చేయనున్నారు. టీ-ఫైబర్ ఎండీ పన్నీరు వేణు ప్రసాద్ ఈ కొత్త కార్పొరేషన్‌కు సీఈఓగా వ్యవహరించనున్నారు. టీ-ఫైబర్ (T-Fiber), కొత్త కార్పొరేషన్ (TRICIL) సంయుక్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నాయి. ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు. సంచార్ భవన్‌లో జరిగిన నేరుగా జరిగిన కార్యక్రమంలో డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా (IAS), తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి (IAS), టీ ఫైబర్ ఎండీ & సీఈఓ పన్నీరు వేణు ప్రసాద్, బీఎస్ఎన్ఎల్ఎ డైరెక్టర్ పాపా సుధాకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ప్రజలకు దీపావళి కానుక

ముద్ర, హైదరాబాద్ :
సామాన్య ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీపావళి పండుగ సందర్భంగా మెట్రో ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్‌ల ధరలను భారీగా తగ్గిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటన విడుదల చేశారు. ఈ కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి రానున్నాయి.

కొత్త పాస్‌ల వివరాలు
నెలవారీ ఉమ్మడి పాస్–ప్రస్తుతం రూ.8,500గా ఉన్న నెలవారీ పాస్ ధరను ఏకంగా రూ.4,000కు తగ్గించారు. ఇందులో రూ.3,000 మెట్రో ప్రయాణానికి, రూ.1,000 ఆర్టీసీ ప్రయాణానికి కేటాయిస్తారు. ఈ పాస్ ద్వారా ప్రయాణికులు నెలలో గరిష్ఠంగా 50 రౌండ్ ట్రిప్పులు ప్రయాణించవచ్చు. దీనివల్ల ప్రయాణికులకు నెలకు రూ.4,500 ఆదా అవుతుంది.
రోజువారీ ఉమ్మడి పాస్ – ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ పాస్ ధరను రూ.275కు తగ్గించారు. ఇందులో రూ.200 మెట్రోకి, రూ.75 ఆర్టీసీకి కేటాయించారు. ఈ పాస్ ద్వారా రోజుకు 4 సింగిల్ జర్నీలకు అనుమతి ఉంటుంది. దీనివల్ల ప్రయాణికులకు రోజుకు రూ.125 ఆదా అవుతుంది.
ప్రజల సంక్షేమం, ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్యులు, ఉద్యోగులకు ఎంతో ఊరటనిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎక్స్ వేదికగా తెలిపారు. నవంబర్ 8 నాటికి అవసర మైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

బీజేపీలో పొలిటికల్ గేమ్!



(మొదటిపేజీ తరువాయి)
అధ్యక్షుడే ఎన్నికల ప్రచారంలో నిమగ్నమవడం పార్టీకి ఇబ్బందికరంగా మారుతుందనే చర్చ సాగుతోంది. ముఖ్యంగా విద్యావంతులు, పట్టభద్రులు అధికంగా ఉండే ఈ నియోజకవర్గంలో ఓటమి ఎదురైతే రామచంద్రరావు నాయకత్వంపై ప్రశ్నలు తలెత్తడం ఖాయం. నైతిక బాధ్యత వహిస్తూ ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి కూడా రావచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే గెలుపుపై ధీమాతోనే ఆయన ఈ సవాల్‌ను స్వీకరిస్తున్నారా? లేక అధిష్ఠానం నిర్ణయం మేరకే ముందు కు వెళ్తున్నారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

బండి రీ ఎంట్రీకి రంగం సిద్ధమా?
ఇదిలా ఉంటే తెలంగాణ బీజేపీలో మరో ప్రచారం జోరందుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను ప్రాతిపదికగా చేసుకుని రాష్ట్ర పార్టీ నాయకత్వంలో మార్పులు చేపట్టేందుకు అధిష్ఠానం వ్యూహరచన చేస్తోందన్న చర్చ జరుగుతోంది. రామచంద్రరావుకు ప్రతికూల ఫలితం ఎదురైతే ఆయన స్థానంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మరోసారి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బండి సంజయ్ గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీలో కనిపించిన దూకుడు, క్షేత్రస్థాయి కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహం ప్రస్తుతం తగ్గిందనే అభిప్రాయం కొందరు నేతల్లో ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు గట్టి పోటీ ఇవ్వాలంటే దూకుడైన నాయకత్వం అవసరమని, అందుకు బండి సంజయ్ సరైన ఎంపిక కావచ్చని కొందరు భావిస్తున్నారు.
గెలిస్తే పట్టు.. ఓడితే ముప్పు!
మొత్తంగా రామచంద్రరావు ఎమ్మెల్సీ పోటీ ఆయన వ్యక్తిగత రాజకీయ ప్రతిష్ఠతో పాటు తెలంగాణ బీజేపీ భవిష్యత్ నాయకత్వానికి కూడా కీలకంగా మారుతోంది. గెలిస్తే రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన పట్టు మరింత పెరుగుతుంది. ఓటమి ఎదురైతే మాత్రం నాయకత్వ మార్పు చర్చలకు బలం చేకూరే అవకాశం ఉంది. మరి రామచంద్రరావు ఈ రాజకీయ పరీక్షలో విజయం సాధిస్తారా? లేక ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీలో కొత్త నాయకత్వానికి దారితీస్తాయా? అన్నది వేచి చూడాలి.

ఎన్నికల కంటే.. ప్రజా సమస్యలే ముఖ్యం

ముద్ర, అమరావతి :
తుపాన్ల వల్ల కోస్తా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం.. ఏరియల్ సర్వే నిర్వహించారు. బాపట్ల, గుంటూరు జిల్లాల పర్యటనకు వెళ్తున్న సమయంలో హెలికాప్టర్ ద్వారా పంట నష్టాన్ని పరిశీలించారు. హెలికాప్టర్‌లో సూర్యలంక ఎయిర్ ఫోర్స్ స్టేషన్లో దిగి.. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బాపట్ల మండలం జిల్లెలమూడి వంతెన వద్దకు చేరుకున్నారు. మురసు తుపానుకు గండ్లు పడిన డ్రెయిన్‌ను పరిశీలించి.. నీటిపారుదలశాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అక్కడి నుంచి గుంటూరు జిల్లా కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చేరుకుని దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. డ్రెయిన్లకు గండ్లు పడిన కారణంగా నీట మునిగిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. 'తుపాను కారణంగా గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టం తగ్గించేందుకు ముందు జాగ్రత్తలు తీసుకున్నాం. పంటల బీమా కట్టాలని ప్రతి రైతును కోరుతున్నాం. మొన్నటి వరకు ఎల్‌నినో



తో ఇబ్బందులు.. ఇప్పుడు తుపాన్లు దెబ్బతీశాయి. వరుసగా రెండు తుపాన్లు రావడం చరిత్రలో మొదటి సారి. అర్నబ్, మురసు వల్ల సంభవించిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నాం. తుపాన్ల ప్రభావితంపై కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాం.. ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి సాయం అందేంత వరకూ పని చేస్తాం. నల్లమడ డ్రైన్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాం. వైకాపా ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగింది. గత పాలనలో తుపాన్లు వస్తే రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి...పరామర్శించారు. ఎన్నికల కంటే.. ప్రజా సమస్యలే ముఖ్యమని భావించి తుపాన్ల సమయంలో పనిచేశాం. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చాక.. అన్ని విషయాలు మాట్లాడతాం. తీర ప్రాంతాలను తుపాన్లు దెబ్బతీస్తే.. రాయలసీమ ప్రాంతాన్ని ఎల్‌నినో ఇబ్బంది పెట్టింది. రాయలసీమలో కూడా కరవును అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు పర్యటించాయి. తీర ప్రాంతంలో నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతుంటే.. రాయలసీమ ప్రాంతం నీటి కొరతను ఎదుర్కొంటోంది. అందుకే నీటి భద్రతకు.. సమర్థ నీటి నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం' అని సీఎం వివరించారు.

కట్టుతప్పుతున్న క్రమశిక్షణ



(మొదటి పేజీ తరువాయి)
సమన్వయ కమిటీల పేరుతో కాలయాపన చేయడం వల్లే నేతల్లో క్రమశిక్షణ భయం తగ్గిపోయిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


ఢిల్లీ అండతోనే ధిక్కార స్వరమా?
రాష్ట్ర నాయకత్వాన్ని కాదని నేరుగా ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చనే ధీమా కొందరు నేతల్లో కనిపిస్తోందన్న చర్చ సాగుతోంది. రేవంత్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న కొన్ని వర్గాలు సందర్భం దొరికినప్పుడల్లా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ పరిణామాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు కూడా గ్రూపు రాజకీయాలను నియంత్రించడం సవాల్‌గా మారింది.

ఇలాగే కొనసాగితే నష్టమే!
ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెంచుకోవాలంటే సంక్షేమం, అభివృద్ధితో పాటు పార్టీలో క్రమశిక్షణ కూడా కీలకం. సొంత నేతలే ప్రభుత్వాన్ని బహిరంగంగా విమర్శిస్తుంటే విపక్షాలకు అది రాజకీయ అస్త్రంగా మారుతుంది. ఇప్పటికైనా అధిష్ఠానం జోక్యం చేసుకుని నేతల మధ్య విభేదాలకు అడ్డుకట్ట వేయకపోతే, ఈ అంతర్గత పోరే రేవంత్ ప్రభుత్వానికి భవిష్యత్తులో పెద్ద రాజకీయ సమస్యగా మారే ప్రమాదం ఉంది.



తనను తానే సృష్టించుకోనున్న ఏఐ

ముద్ర, న్యూఢిల్లీ :
ఒకనాడు మనిషి తన బద్ధకాన్ని వదిలించుకోవడానికి, శ్రమను తగ్గించుకోవడానికి చిన్న చిన్న యంత్రాలను సృష్టించాడు. ఆ యంత్రాలు చక్రాలై కదిలాయి, కంప్యూటర్లై ఆలోచించాయి. ఇంటర్నెట్ రూపంలో ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపాయి. చివరకు 'కృత్రిమ మేధస్సు' (AI) రూపంలో దేవుడిలా సృష్టికర్త పాత్ర పోషించాలనుకున్నాయి! మనం అడిగిన అక్షరాలను పదాలుగా మార్చడం నుంచి, ప్రాణాలను కాపాడే వైద్య పరిశోధనల వరకు అన్నీ తానై నడిపిస్తోన్న ఏఐ.. ఇప్పుడు తనకంటే శక్తిమంతమైన మరో సృష్టిని తానే చేయబోతుందా? మనిషికి ప్రత్యామ్నాయంగా ఎదిగే స్థాయికి చేరుకుందా? ఇదే ఇప్పుడు టెక్నాలజీ ప్రపంచాన్ని నిద్రపోనివ్వని అతిపెద్ద కలవరం!
ఇప్పటివరకు ఏఐని పెంచి పెద్దచేయడానికి వేలాది మంది సైంటిస్టుల మెదళ్లు, నెలల తరబడి ప్రయోగాలు అవసరమయ్యాయి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. తప్పులను సరిదిద్దడం, కోడింగ్ రాయడం, కొత్త మోడళ్లకు రూపకల్పన చేయడం వంటి పనులను ఏఐ తనంతట తానే వేగంగా చేసుకుంటూ పోతోంది. ఇదే కొనసాగితే... రేపు తన తర్వాతి తరాన్ని, తనకన్నా వంద రెట్లు శక్తిమంతమైన మరో ఏఐని అదే సృష్టించుకోగలదు. దీనినే సాంకేతికంగా 'రికర్సివ్ సెల్ఫ్ ఇంప్రూవ్‌మెంట్' అంటారు. అంటే, తనను తాను మెరుగుపరుచుకుంటూ దేవుడి స్థాయికి ఎదిగే ప్రమాదకర ప్రయాణం!
ప్రముఖ ఏఐ సంస్థ 'అంత్రోపిక్' చేసిన హెచ్చరికలు ఈ భయాలను నిజం చేస్తున్నాయి. ఏఐ సాయంతో మరింత అడ్వాన్స్‌డ్ ఏఐల తయారీ ఊహకందని వేగంతో దూసుకుపోతోందని, ఇది సమీప భవిష్యత్తులోనే జరగవచ్చని ఆ సంస్థ అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు వెల్లడించింది. ఇక్కడ అసలు ముప్పు సినిమాల్లో చూపించినట్లు ఏఐ మనుషులపై తిరుగుబాటు చేయడం కాదు; దాని వేగాన్ని మనం అందుకోలేకపోవడమే! ఒక కొత్త మోడల్ లో పాలను సరిదిద్దేలోపే, అంతకంటే శక్తిమంతమైన మరో రాక్షస బ్రైన్ పుట్టుకొస్తే... దానిని నియంత్రించడం మానవజాతికి అసాధ్యమైపోతుంది. అమెరికా మాత్రమే కాదు, భారత్ లాంటి దేశాలు కూడా ఈ సాంకేతిక సునామీని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి. అభివృద్ధి వేగం ముఖ్యం కావచ్చు, కానీ మానవ నియంత్రణను కోల్పోతే ఈ సృష్టి మన వినాశనానికే దారితీస్తుంది. మనం సృష్టించిన ఈ అద్భుతం మన ఉనికికే ముప్పుగా మారకముందే, కళ్లెం వేయాల్సిన సమయం ఆసన్నమైంది!



బియ్యం ధరలకు కళ్లెం

ముద్ర, హైదరాబాద్:
ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించడంతో పాటు ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా కిలో బియ్యాన్ని రూ.66, రూ.74, రూ.79 చొప్పున మూడు రకాల ధరలకు విక్రయించేలా ఏర్పాట్లు చేసింది.హైదరాబాద్ నగరవ్యాప్తంగా మొత్తం 10 విక్రయ కేంద్రాలను ప్రారంభించగా, మలక్‌పేటలోని నేహా రైస్ ట్రేడర్స్ విక్రయ కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి కె. శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ణయించిన ధరలకే నిత్యావసర సరుకులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించే ఉద్దేశంతో సరుకులను అక్రమంగా నిల్వ చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వినియోగదారులను మోసం చేసే వ్యాపారులపై నిఘా పెంచినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు లీగల్ మెట్రాలజీ అధికారులు 450 తనిఖీలు నిర్వహించి, 25 లీగల్ మెట్రాలజీ కేసులు, 17 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేసినా, తూకాల్లో మోసాలకు పాల్పడిన, నిత్యావసర సరుకులను అక్రమంగా నిల్వ ఉంచిన ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.ధరల నియంత్రణ తో పాటు సామాన్యులకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలు వినియోగదారులకు కొంత ఊరటనివ్వనున్నాయి. ఈ కార్యక్రమంలో ఏసీఎస్ఓ నర్సింగ్ రాజ్, డీటీ-ఎన్ఈ ఎఫ్‌టీ హరికృష్ణ, జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్, జూనియర్ ఎంక్వైరీ ఇన్‌స్పెక్టర్ టి. భరత్ కుమార్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శనివారం 7.11.2026

టీ, కాఫీలకు గుడ్‌బై చెప్పాల్సిన అవసరం లేదు!

టీ, కాఫీ తాగడం వల్లే క్యాన్సర్ వస్తుందని కాదు. వాటిని మరీ వేడిగా తాగడమే ప్రధాన సమస్య. కాబట్టి టీ, కాఫీలను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. తగినంత చల్లారిన తర్వాత తాగడం అలవాటు చేసుకోవాలి.



ఇందిరమ్మ ఇళ్ల వద్ద దీపావళి సంబరాలు

*** 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం**
*** పూర్తయిన 2 లక్షల ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి వేడుకలు**
*** హైదరాబాద్‌లోని ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టు సైట్లలోనూ ఉత్సవాలు**
*** లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవాలని ప్రభుత్వ ఆహ్వానం**



ముద్ర, హైదరాబాద్ : పేదల సొంత ఇంటి కలను నిజం చేస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్న ఇందిరమ్మ ఇళ్ల వద్ద ఈసారి దీపావళి పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ఉత్సవాలకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి పండుగను జరుపుకోనున్నారు. ఈ విషయాన్ని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపి గౌతం వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి, ఆ కుటుంబాల సమక్షంలోనే పండుగ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 5.50 లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటివరకు సుమారు రెండు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వీపి గౌతం వివరించారు. ఈ ఇళ్ల లబ్ధిదారులకు ఇప్పటివరకు సుమారు రూ.8 వేల కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో పూర్తయిన ఇళ్ల వద్ద వేడుకలు నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది, గ్రామ కార్యదర్శులకు ఇప్పటికే సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు దీపాలు వెలిగించి పండుగ జరుపుకుంటున్న ఫొటోలను ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ద్వారా తీసి, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టు సైట్లలోనూ వేడుకలు

హైదరాబాద్ మహానగర పరిధిలో పేదలకు సొంత ఇళ్లు కల్పించేందుకు చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాల్లోనూ దీపావళి వేడుకలు నిర్వహించనున్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తికాగా, పలు ప్రాంతాల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

దీపావళి రోజున సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు టవర్స్ నిర్మాణ ప్రాజెక్టు సైట్ల వద్ద వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వీపి గౌతం తెలిపారు. త్వరలో పొరుగువారిగా కలిసి నివసించబోయే కుటుంబాలు తమకు కేటాయించిన సొంత ఇంటి ప్రాంగణంలోనే పండుగ జరుపుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని పేర్కొన్నారు. టవర్స్ లబ్ధిదారులందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. వచ్చే ఏడాది దీపావళి నాటికి లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలో గృహప్రవేశాలు చేసుకుని పండుగను మరింత ఆనందంగా జరుపుకునేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

IPE డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి



ముద్ర, హైదరాబాద్ : ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజ్ (IPE) హైదరాబాద్ డైరెక్టర్ గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి బాధ్యతలు స్వీకరించారు. గతంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ గా, తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సీనియర్ ప్రొఫెసర్ గా ఆయన పనిచేశారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా సంస్థల CEOగా సేవలందించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీ అంబుడ్స్ పర్సన్ గా కొనసాగుతున్నారు. ఆయన అనుభవం, నాయకత్వంతో సంస్థ విద్యా ప్రమాణాలు, పరిశోధన, అభివృద్ధి మరింత ముందుకు సాగుతాయని IPE యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.

రాప్తాడు బాలిక లక్ష్మికి ఆనంద్ మహీంద్రా బాసట..!



ముద్ర, అనంతపురం : అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి అమ్మాయిపై ఎలక్ట్రిక్ రంపంతో జరిగిన దాడి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఒక స్కూలు క్లాస్‌రూమ్‌లో జరిగిన ఈ ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. యావత్తు దేశం ఉలిక్కిపడేలా చేసిన ఘటన ఇది. అయితే ఆ వేళ ఉన్మాది గోపిక అనే అమ్మాయిపై రంపంతో దాడిచేస్తుంటే..స్నేహితురాలు లక్ష్మి ప్రాణాలు పణంగా పెట్టి కాపాడే ప్రయత్నం చేసింది. ఆ ఆకస్మిక దాడికి ఎవరికి వారు ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రయత్నం చేసే తరుణంలో ఆమె చూపిన తెగువ అందరి హృదయాల్ని తాకడమే కాదు..ఆమె స్పందించిన తీరుకి సలాం అని జైజైలు కొట్టారు. అయితే ఈ ఘటనలో ఆమె కూడా తీవ్ర గాయలపాలైంది. ప్రతి ఒక్కరూ ఆమెను సాహసలక్ష్మీ అంటూ వేనోళ్ల కొనియాడారు. దీనిపై పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా స్పందిస్తూ..ఎక్స్ పోస్ట్‌లో ఇలా రాసుకొచ్చారు. సదరు సాహసలక్ష్మీని రియల్ హీరో అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. అంతేగాదు ఫ్రెండ్ కోసం ప్రాణాలు అడ్డుపెట్టి పోరాడిన తీరుకి ఫిదా అవుతూ ఆమె చదువుకు అవసరమయ్యే ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. తన ఎడ్యుకేషన్ ట్రస్ట్ నన్హికలి అండగా ఉంటుందని ప్రకటించారు. ఆమె అసాధారణమైన యువతి అని, ధైర్యం అంటే భయపడకపోవడం కాదు, అవతలి వాళ్లపట్ల చూపే శ్రద్ధ అని అన్నారు. కాగా, ఈ ఘటనకు కారణమైన నిందితుడు హేమంత్‌ని గుర్తించి అరెస్టు చేశారు. అతడు బాధితురాలి మేనమామ అని, గత కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నట్లు సమాచారం.

వైద్యం కోసం రూ.10 లక్షల అప్పు..

- చివరకు శ్మశానవాటికే ఆవాసం



ముద్ర, కరీంనగర్ : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన అమృత తన కుమారుడు రాకేష్ వైద్యం కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసి అప్పులపాలయ్యారు. అద్దె ఇల్లు తీసుకునే స్థోమత లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో కుమారుడితో కలిసి వేములవాడలోని శ్మశానవాటికలోనే ఆశ్రయం పొందుతున్నారు. బతుకుదెరువు కోసం పోరాడుతున్న తల్లీకొడుకులు బతికుండగానే శ్మశానవాటికలో కాలం వెళ్లదీస్తున్న దయనీయ పరిస్థితి పలువురిని కలచివేస్తోంది.

టీటీడీ ప్రత్యేక అధికార సంస్థ చైర్మన్‌గా రవిచంద్ర




ముద్ర, తిరుమల: టీటీడీ ప్రత్యేక అధికార సంస్థ చైర్మన్‌గా ఐఏఎస్ అధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికార సంస్థ సభ్యులు కన్నబాబు, వినయ్ చంద్‌తో పాటు టీటీడీ జేఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రముఖులను కలిసిన బండారు దత్తాత్రేయ



ముద్ర, న్యూఢిల్లీ: మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం న్యూఢిల్లీలో పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌లతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారికి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్లోబల్ సమ్మిట్‌కు ప్రముఖుల హాజరుపై సీఎస్ సమీక్ష



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు కీలక గమ్యస్థానంగా నిలబెట్టే లక్ష్యంతో డిసెంబర్ 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు నిర్వహించ నున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఈ సదస్సుకు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ప్రపంచ పెట్టుబడిదారులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆహ్వానాలు పంపిన ప్రముఖుల వివరాలు, వారి నుంచి వచ్చిన అంగీకారాలపై ఆరా తీశారు. ప్రముఖుల భాగస్వామ్యాన్ని ఖరారు చేసేందుకు నిరంతర సంప్రదింపులు జరుపుతూ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

దేశంలోనే అతిపెద్ద బహుళ రంగాల ఎక్స్‌పోల్లో ఒకటిగా ఈ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక బలాలు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న నూతన రంగాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఇది కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పెట్టుబడుల రంగంలో తెలంగాణ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు తీసుకురావడంలో ఈ సదస్సు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ్డిని కలిసేందుకు 350 కి.మీ. పాదయాత్ర



ముద్ర, కరీంనగర్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తాయన్న ఏకంగా 350 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించారు. అక్టోబర్ 29న ఆదోని నుంచి బయలుదేరిన ఆయన.. తొమ్మిది రోజుల పాదయాత్ర అనంతరం ఇవాళ హైదరాబాద్ చేరుకున్నారు. ముఖ్యమంత్రి పై తనకున్న అభిమానాన్ని చాటుకుంటూ ఈ సుదీర్ఘ ప్రయాణం చేసినట్లు సాయన్న తెలిపారు.

రైతుల ఆదాయమే లక్ష్యం.. హకీంపేటలో మెగా రైతు మేళా

నవంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ.. 50 వేల మంది రైతుల హాజరు
150 ప్రదర్శన స్టాళ్లలో ఆధునిక యంత్రాలు, డ్రోన్లు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



ముద్ర, హైదరాబాద్: రైతుల ఆదాయాన్ని పెంచి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం హకీంపేటలో మెగా రైతు మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేళాను ప్రారంభించనున్నారు.మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాకు పది జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరుకానున్నారు. మొత్తం 150 ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేసి ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, నూతన సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. రైతులు, శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో సీఎం ముఖాముఖి చర్చలు జరపనున్నారు.

సాగు ఖర్చులు తగ్గించడంతో పాటు పంటలకు మెరుగైన ధరలు, మార్కెట్ అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తుమ్మల పేర్కొన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.ఇదే పర్యటనలో లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో ఎకో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీకి సీఎం శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు పెద్ద సంఖ్యలో మేళాలో పాల్గొని ఆధునిక సాగు పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత



ముద్ర, హైదరాబాద్: మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యా అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. విద్య, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజాభవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నాంపల్లిలోని హజ్‌హౌస్ పక్కన అసంపూర్తిగా ఉన్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.25 కోట్లు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఈ భవనంలో మైనార్టీ విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్‌తో పాటు సంక్షేమ శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే మొఘల్‌పురా, బండ్లగూడలో రెండు స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్యా అవకాశాలను మరింత విస్తరించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం పరిధిలోకి ఈజిప్ట్, సౌదీ అరేబియాలను చేర్చనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. షాదీ ముబారక్, ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిష్కారంపై కూడా సమీక్షించారు. క్రైస్తవ మైనార్టీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీ అభివృద్ధితో పాటు అర్హులైన మైనార్టీలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శి బి. షఫీఉల్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా తెలంగాణ: శ్రీధర్ బాబు

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



ముద్ర, హైదరాబాద్, నవంబర్ 6: తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు గమ్యస్థానంగా, ప్రపంచస్థాయి పరిశ్రమలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు నైపుణ్యానికి తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యతని తెలిపారు.

శుక్రవారం హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో పికో టెక్నాలజీ ఇండియా ప్రధాన కార్యాలయాన్ని సంస్థ ఫౌండర్, సీఈఓ జారోడ్ యస్టర్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సహకారం అందిస్తూ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

తెలంగాణ పెట్టుబడి సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌ను పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ–సమ్మిట్ కార్యక్రమంగా ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో దేశవ్యాప్తంగా రహదారుల రంగ నిపుణులు, ఇంజినీర్లు పాల్గొననున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

శనివారం,
07 నవంబర్, 2026


4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

ముందస్తు గుర్తింపే..
శ్రీరామరక్ష
నవంబర్ 7 జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం

భారతదేశంలో క్యాన్సర్ మహమ్మారి తీవ్రత వేగంగా పెరుగుతోంది. ఈ ప్రాణాంతక వ్యాధి పట్ల ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించడం, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేయడం మరియు అవసరమైన చికిత్సా వసతులను అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ప్రతి సంవత్సరం నవంబర్ 7న 'జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం' నిర్వహిస్తారు. నోబెల్ బహుమతి గ్రహీత, రేడియం ఆవిష్కర్త మేడం క్యూరీ జయంతిని పురస్కరించుకుని 2014లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. క్యాన్సర్‌ను కేవలం ఒక వ్యాధిగా కాకుండా, ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించగల ఆరోగ్య సవాలుగా చూడటమే దినోత్సవ ఉద్దేశం.



భారతదేశంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య రోజురోజుకూ ఆందోళనకరంగా పెరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఐసీఎంఆర్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పురుషులలో నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రధానంగా నమోదువుతుండగా, మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార (గర్భాశయ గ్రీవ) క్యాన్సర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మారుతున్న జీవనశైలి, పొగాకు ఉత్పత్తుల వాడకం, మద్యపానం, శారీరక శ్రమ లేకపోవడం, ప్రాసెస్ చేసిన ఆహార అలవాట్లు మరియు పర్యావరణ కాలుష్యం ఈ వ్యాధి తీవ్రతకు కారణాలు.

క్యాన్సర్ అనగానే అది మరణశాసనం అనే భయం సమాజంలో ఇప్పటికీ నెలకొని ఉంది. అయితే, తొలి దశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిస్థాయిలో నయం చేయడం సాధ్యమవుతుంది. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, శరీరంలో వచ్చే చిన్నపాటి మార్పులను (నయం కాని పుండ్లు, అసాధారణ రక్తస్రావం, గడ్డలు, ఆకలి మందగించడం) నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం అత్యంత ముఖ్యం. 'మామోగ్రఫీ', 'పాప్ స్మియర్' వంటి ప్రాథమిక పరీక్షల ద్వారా మహిళలు తమ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించుకోవచ్చు.


వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే వ్యాధి రాకుండా నిరోధించడమే అత్యుత్తమ మార్గం. సమతుల్య ఆహారం తీసుకోవడం, రోజూ వ్యాయామం చేయడం, పొగాకు, మద్యం దూరంగా ఉండటం ద్వారా దాదాపు 30 నుండి 40 శాతం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు. అలాగే, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి (HPV) వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ప్రభుత్వాలు గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన రోగనిర్ధారణ పరికరాలను అందుబాటులో ఉంచడం ద్వారా మరింతమందికి సకాలంలో వైద్యం అందేలా చూడవచ్చు.

వైద్య విజ్ఞాన రంగంలో జరుగుతున్న అద్భుతమైన ఆవిష్కరణల కారణంగా క్యాన్సర్ చికిత్స విధానాలు గతంతో పోలిస్తే ఎంతో మెరుగయ్యాయి. ఒకప్పుడు కీమోథెరపీ మరియు రేడియోథెరపీ మాత్రమే ప్రధాన మార్గాలుగా ఉండేవి, ఇవి ఆరోగ్యకరమైన కణాలపై కూడా తీవ్ర ప్రభావం చూపేవి. కానీ నేడు ఇమ్యునోథెరపీ,టార్గెటెడ్ థెరపీ, జన్యుపరమైన చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఇమ్యునోథెరపీ ద్వారా రోగి శరీరంలోని సొంత రోగనిరోధక శక్తిని ఉత్తేజపరిచి క్యాన్సర్ కణాలపై దాడి చేసేలా చేస్తారు. అలాగే టార్గెటెడ్ థెరపీ ద్వారా ఆరోగ్యకరమైన కణాలకు ఎటువంటి హాని కలగకుండా కేవలం క్యాన్సర్ కణాలను మాత్రమే గుర్తించి నాశనం చేయడం సాధ్యమవుతోంది. ఈ అధునిక సాంకేతికతలు రోగి త్వరగా కోలుకోవడానికి, ప్రాణాలను కాపాడుకోవడానికి ఎంతో దోహదపడుతున్నాయి.

క్యాన్సర్ అంటే కేవలం శారీరక రుగ్మత మాత్రమే కాదు, అది రోగి మానసిక స్థితిపై కూడా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. వ్యాధి సోకిందనే భయం, ఖరీదైన చికిత్సల భారంతో కూడిన ఆందోళన రోగిని మానసికంగా కుంగదీస్తాయి. ఈ క్లిష్ట సమయంలో వైద్య చికిత్సతో పాటు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, ఆప్యాయత, మానసిక స్థైర్యం అత్యంత కీలకం. 'సపోర్ట్ గ్రూప్స్' మరియు కౌన్సెలింగ్ ద్వారా క్యాన్సర్‌ను జయించిన వారి అనుభవాలను పంచుకోవడం వల్ల బాధితులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. 'నేను క్యాన్సర్‌ను జయించగలను' అనే సానుకూల దృక్పథం రోగనిరోధక శక్తి పెంచి, ఔషధాలు మెరుగ్గా పనిచేసేలా చేస్తుందని అనేక వైద్య అధ్యయనాలు నిరూపించాయి. క్యాన్సర్ పోరాటంలో భయాన్ని పక్కనబెట్టి అవగాహన పెంచుకోవడమే అతిపెద్ద ఆయుధం. క్యాన్సర్ బాధితులకు సమాజం, కుటుంబం నైతిక, మానసిక మద్దతుగా నిలవాలి. బాధితులు అధైర్యపడకుండా సకాలంలో సరైన చికిత్స పొందేలా చైతన్యం తేవడమే జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం ఇచ్చే సందేశం. ఆరోగ్యకరమైన అలవాట్లు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం ద్వారా క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మించడం మనందరి సామాజిక బాధ్యత.

సుధాకర్ పీవీ
9000674747





రెండు గుప్పెళ్ళు తింటే
రోగనిరోధక శక్తి డబుల్

శెనగలు తింటే ఎసిడిటీ వస్తుందని, ఇంకా ఇతర సమస్యలు వస్తాయని చాలా మందిలో అపోహలు ఉన్నాయి. అయితే, తెల్ల శెనగలు కంటే నల్ల శెనగలు అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి మీరు వీటిని సరైన పద్ధతిలో ఆహారంలో చేర్చుకోవడం వలన మధుమేహం నియంత్రణ, మలబద్ధకం నివారణ, రక్తహీనత వంటి ఎన్నో సమస్యలను తరిమికొట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు.

శెనగలు తింటే ఎసిడిటీ వస్తుందని, ఇంకా ఇతర సమస్యలు వస్తాయని చాలా మందిలో అపోహలు ఉన్నాయి. అయితే, తెల్ల శెనగలు కంటే నల్ల శెనగలు అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి మీరు వీటిని సరైన పద్ధతిలో ఆహారంలో చేర్చుకోవడం వలన మధుమేహం నియంత్రణ, మలబద్ధకం నివారణ, రక్తహీనత వంటి ఎన్నో సమస్యలను తరిమికొట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు.

150 గ్రాముల నల్ల శెనగలలో 350 కిలో కేలరీల శక్తి లభిస్తుంది. ఇంకా దీనిలో 60 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 40 గ్రాముల అధిక నాణ్యత ప్రోటీన్లు, కేవలం 6 గ్రాముల కొవ్వులు, 50 గ్రాముల పీచు పదార్థం (ఫైబర్) ఉంటాయి. ఇంకా దీనిలో 400 మైక్రో గ్రాముల ఫోలెట్ (ఫోలిక్ యాసిడ్) ఉంటుంది. ఈ పోషక సమ్మేళనం శనగలను ఒక ఆరోగ్య నిధిగా మార్చుతుంది. ఇంకా ఇవి తేలికగా జీర్ణమవుతాయి.

శెనగలలో ఉండే అధిక ప్రోటీన్, పీచు పదార్థాల కలయిక రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. భోజనంలో సుమారు 20% శెనగలను చేర్చుకుంటే, ఆహారం వలన శరీరంలోకి చేరే గ్లూకోజ్ శోషణ 36% వరకు తగ్గుతుందని శాస్త్రీయంగా కూడా నిరూపించారు. ఈ శెనగలు ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచడంలో, ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో కూడా సహాయపడతాయి, మధుమేహంతో బాధపడేవారికి గొప్ప ప్రయోజనాన్ని అందిస్తాయి.

శెనగలలో ఉండే 25% పీచు పదార్థం మలబద్ధకం సమస్యను సమర్థవంతంగా తగ్గిస్తుంది. ఈ పీచు ప్రేగులను శుభ్రపరిచి, మల విసర్జన సాఫీగా జరిగేలా చేస్తుంది. అంతేకాకుండా, ఈ ఫైబర్ ప్రేగులలో ఉండే లాక్టోబాసిలస్ వంటి ప్రయోజనకరమైన బ్యాక్టీరియా వృద్ధికి తోడ్పడుతుంది, తద్వారా ప్రేగుల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నానబెట్టి, గ్రైండ్ చేసి తయారుచేసిన శనగల పెరుగు గట్ బ్యాక్టీరియాకు అద్భుతమైన ప్రోబయోటిక్‌గా పనిచేస్తుందని వెల్లడించారు.

శెనగలు ఉండే 19 గ్రాముల ప్రోటీన్‌లో మిథియోనిన్ అనే ముఖ్యమైన అమైనో ఆమ్లం ప్రత్యేకంగా ఉంటుంది. ఈ మిథియోనిన్ కాలేయ నిర్విషీకరణ ప్రక్రియకు అత్యంత అవసరం. శరీరం నుండి ఎరువులు, పురుగుమందులు, ఇతర రసాయనాలను విడగొట్టి బయటకు పంపించడానికి ఇది కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి, శెనగలు కాలేయ ఆరోగ్యానికి మద్దతునిస్తాయి.

నాలుగు ఆకులు తీసుకుంటే..
షుగర్ పత్తా లేకుండా పారిపోతుంది

ఆధునిక జీవనశైలిలో అనేకమంది ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యలలో గుండెపోటు, పక్షవాతం, అధిక రక్తపోటు, మధుమేహం వంటివి ముఖ్యమైనవి. ఈ ప్రాణాంతక పరిస్థితులకు తరచుగా రక్తం గడ్డకట్టడం, రక్తనాళాల సమస్యలు ప్రధాన కారణాలు. ఈ సమస్యలను నివారించడంలో ఈ ఆకులు శక్తివంతమైన సహజసిద్ధమైన పరిష్కారంగా చెబుతున్నారు.

ఆధునిక జీవనశైలిలో అనేకమంది ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యలలో గుండెపోటు, పక్షవాతం, అధిక రక్తపోటు, మధుమేహం వంటివి ముఖ్యమైనవి. ఈ ప్రాణాంతక పరిస్థితులకు తరచుగా రక్తం గడ్డకట్టడం, రక్తనాళాల సమస్యలు ప్రధాన కారణాలు. ఈ సమస్యలను నివారించడంలో రాకెట్ లీఫ్ ఒక శక్తివంతమైన సహజసిద్ధమైన పరిష్కారంగా చెబుతున్నారు.

రక్తం గడ్డకట్టడం అనేది గుండెపోటు పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలకు ప్రధాన కారణం. గుండెలోని సన్నటి రక్తనాళాల్లో రక్తం గడ్డలు చేరి రక్త సరఫరాను అడ్డుకోవడం వల్ల హృదయ కండరాలకు ఆక్సిజన్ అందక గుండెపోటు వస్తుంది. అదేవిధంగా, మెదడులోని సూక్ష్మ రక్తనాళాల్లో గడ్డలు ఏర్పడి రక్త సరఫరా ఆగితే పక్షవాతం వస్తుంది. రాకెట్ లీఫ్‌లో సమృద్ధిగా ఉండే పాలీగ్లెకోసిలేటెడ్ ఫ్లేవోన్స్ అనే పదార్థాలు ప్లేట్‌లెట్స్ ఒకదానికొకటి అతుక్కొని రక్తం గడ్డలు కట్టడాన్ని నిరోధిస్తాయి. ఈ ఆకు గుండె, మెదడు ఆరోగ్యానికి గొప్ప రక్షణ కవచంగా పనిచేస్తుంది.

రాకెట్ లీఫ్‌లో నైట్రేట్‌లు, నైట్రైట్‌లు అధిక మొత్తంలో ఉంటాయి. ఈ సమ్మేళనాలు రక్తనాళాలను విశ్రాంతినిచ్చి, సాగే స్వభావాన్ని పెంచుతాయి. దీనివల్ల రక్తనాళాలు ముడుచుకోవడం తగ్గి, రక్తప్రసరణ సులభతరం అవుతుంది. ఫలితంగా రక్తపోటు అదుపులోకి వస్తుంది. అధిక రక్తపోటు అనేది గుండె జబ్బులు, పక్షవాతానికి ఒక ముఖ్యమైన కారణం కాబట్టి, దానిని నియంత్రించడం ద్వారా ఈ ప్రమాదాలను తగ్గిస్తుంది.

రాకెట్ లీఫ్‌లో గ్లూకోసైనోలేట్‌లు అనే మరో ముఖ్యమైన సమ్మేళనం ఉంది. ఇది కండరాల కణాలలోకి గ్లూకోజ్‌ను ఎక్కువగా చేరేలా చేస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి, తద్వారా టైప్ 2 డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అంతే కాకుండా, ఇది ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇన్సులిన్ నిరోధకత వల్ల మహిళల్లో పీసీఓఎస్ వంటి సమస్యలు తలెత్తుతాయి. రాకెట్ లీఫ్ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఇన్సులిన్ నిరోధకత తగ్గి, పీసీఓఎస్ సమస్య రాకుండా నివారించవచ్చు. సరిహద్దు మధుమేహం ఉన్నవారికి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడంలో ఇది చాలా ఉపయోగపడుతుంది.

రాకెట్ లీఫ్‌ను సలాడ్‌లలో, స్మూతీస్‌లో, లేదా ఇతర వంటకాలపై డ్రెస్సింగ్‌గా ఉపయోగించవచ్చు. ఇది తమలపాకు లేదా పుదీనా వలె కాస్త ఘాటైన రుచిని కలిగి ఉంటుంది కాబట్టి తక్కువ మోతాదులో వాడటం మంచిది. కూరగా వండటానికి ఇది అనుకూలం కాదు. దీనిని శీతాకాలంలో సులభంగా పండించవచ్చు. వేసవిలో కూడా కుండీలలో పెంచుకోవచ్చు. రాకెట్ లీఫ్ విత్తనాలు ఇప్పుడు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి, కాబట్టి ఇంట్లో కూడా సులభంగా పెంచుకోవచ్చు



బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిన వారందరికీ రొమ్ము తొలగించాల్సిన అవసరం లేదు

ప్రస్తుత వైద్యశాస్త్రం మాత్రం వేరే పరిష్కారాలు చూపుతోంది. రొమ్ము క్యాన్సర్ వచ్చిన ప్రతి మహిళకూ రొమ్మును పూర్తిగా తొలగించాల్సిన అవసరం లేదు. క్యాన్సర్ ఏ దశలో ఉంది, దాని పరిమాణం, రొమ్ములో ఏ భాగంలో ఉంది అనే విషయాలను బట్టి చాలా మంది మహిళలకు రొమ్మును తొలగించకుండానే చికిత్స అందించవచ్చని వైద్యులు చెబుతున్నారు. భారత మహిళల్లో ఎక్కువగా కనిపించే క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్ అని ప్రపంచ ఆరోగ్యం సంస్థకు చెందిన క్యాన్సర్ పరిశోధనావిభాగం ఐఏఆర్సీ విడుదల చేసిన గ్లోబోకాన్ 2024 చెబుతోంది. భారత్‌లో ఒక్క 2024లోనే 2 లక్షల37వేల కొత్త కేసులు నమోదయ్యాయి. మహిళల్లో మొత్తం క్యానర్సర్ కేసుల్లో ఇది 30 శాతం.

చికిత్స ఎప్పుడు చేస్తారు?


రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించినట్టయితే చాలా మంది మహిళలకు రొమ్మును పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉండదని క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణులు తెలిపారు. 'క్యాన్సర్‌ను మొదటి లేదా రెండో దశల్లో గుర్తిస్తే, వ్యాధి ఉన్న భాగాన్ని మాత్రమే తొలగించి, మిగిలిన రొమ్మును అలాగే ఉంచే 'బ్రెస్ట్ కన్జర్వేషన్ సర్జరీ' చేయవచ్చు. కానీ ఈ విధానం అందరికీ ఒకేలా ఉండదు' అని సెల్వి రాధాకృష్ణన్ తెలిపారు. రొమ్ము పరిమాణం, క్యాన్సర్ కణితి పరిమాణం, కణితి ఉన్న ప్రదేశం, రొమ్ము కణజాలం స్వభావం వంటి అంశాలు చికిత్సలో కీలక పాత్ర పోషిస్తాయి. రొమ్ము పరిమాణాన్ని ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జీ, హెచ్‌వంటి రకాలుగా వర్గీకరిస్తారని డా క్టర్ సెల్వి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. 'ఉదాహరణకు చిన్న రొమ్ములో 2 లేదా 3 సెంటీమీటర్ల పరిమాణమే ఉన్న కణితి ఉన్నా అది ఎక్కువ భాగాన్ని ప్రభావితం చేసి ఉండొచ్చు. అదే పరిమాణం కణితి పెద్ద రొమ్ములో ఉంటే దాన్ని తొలగించడం సులభం' అని తెలిపారు.

కణితి చనుమొనకు దగ్గరగా ఉంటే..

'రొమ్ము చనుమొనకు కణితి దగ్గరగా ఉందా లేక రొమ్ము బయటి భాగంలో ఉందా అనేది కూడా ముఖ్యం. ఒకవేళ కణితి చంకకు దగ్గరగా, రొమ్ము బయటి భాగంలో ఉంటే దానిని తొలగించడం, రొమ్మును అలాగే ఉంచడం కొంత సులభం అవుతుంది. అదే చనుమొన వెనక లేదా రొమ్ము మధ్యలో కణితి ఉంటే చికిత్స చేయడం కష్టంగా మారొచ్చు' అని సెల్వి రాధాకృష్ణన్ అంటున్నారు. 'కొంత మంది రోగుల్లో కణితి పరిమాణాన్ని తగ్గించడానికి శస్త్రచికిత్సకు ముందే కీమోథెరపీ చేస్తారు. దీని వల్ల రొమ్మును పూర్తిగా తొలగించకుండానే చికిత్స చేయగల అవకాశం పెరుగుతుంది' అని డాక్టర్ చెప్పారు. ఇప్పుడు రొమ్మును సంరక్షించే శస్త్రచికిత్సా విధానాన్నే ప్రపంచవ్యాప్తంగా ఆమోదిస్తున్నారు. రొమ్ము క్యాన్సర్ ప్రారంభ దశలో ఉన్న రోగులకు శస్త్రచికిత్స తర్వాత రేడియేషన్ థెరపీతోపాటు రొమ్ము ను రక్షించే శస్త్రచికిత్స చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు పలు ఆరోగ్య సంస్థలు సిఫార్సు చేస్తున్నాయి. రొమ్ము క్యాన్సర్ ప్రారంభ దశలో ఉన్న రోగుల్లో రొమ్మును సంరక్షిస్తూ చేసే చికిత్స, రొమ్మును తొలగించే మాస్టెక్టమీ లాంటి చికిత్సల మధ్య ఎక్కువ కాలం జీవించే విషయంలో పెద్ద తేడా ఉండదని అమెరికన్ క్యాన్సర్ సొసైటీ, నేషనల్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ పేర్కొన్నాయి. రోగి ఆరోగ్య పరిస్థితికి, క్యాన్సర్ స్వభావానికి తగినట్టుగా ఉంటే రొమ్మును కాపాడే చికిత్సను ఎంచుకోవచ్చు. వైద్యపరంగా కూడా ఇది ఆ మోదించిన విధానమే. కాబట్టి 'రొమ్ము క్యాన్సర్ వస్తే రొమ్మును పూర్తిగా తొలగించాల్సిందే' అనే అభిప్రాయం ప్రస్తుతం సరైనది కాదు. క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తిస్తామనేదే ముఖ్యం. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే క్యాన్సర్ నుంచి బయటపడడంతోపాటు రొమ్మును కూడా కాపాడుకునే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

ఆకారం మారకుండా ఉండాలంటే..

'రొమ్మును కాపాడుకోవడం అంటే కేవలం క్యాన్సర్ కణితిని తొలగించడం మాత్రమే కాదు' అని రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన ప్లాస్టిక్ సర్జన్ నిపుణురాలు డాక్టర్ మంజులారావు చెప్పారు. 'క్యాన్సర్ కణితిని తొలగించిన తర్వాత ఏర్పడే ఖాళీని పునర్నిర్మాణ శస్త్రచికిత్స ద్వారా పూరించవచ్చు. దీనికి రొమ్ములో మిగిలిన కణజాలాన్నే ఉపయోగించవచ్చు లేదా పొట్ట వంటి శరీరంలోని ఇతర భాగాల నుంచి కణజాలాన్ని తీసుకొచ్చి రొమ్ములో కణితిని తొలగించిన చోట అమర్చవచ్చు' అని ఆమె వివరించారు. ఈ చికిత్స ప్రారంభ దశలో ఉన్న రోగులకే కాకుండా కొంతమంది మూడో దశ క్యాన్సర్ రోగులకు కూడా ఉపయోగపడవచ్చని డాక్టర్ మంజులారావు చెప్పారు. క్యాన్సర్ కణితిని తొలగించే శస్త్రచికిత్స సమయంలోనే రొమ్మును తిరిగి పునర్నిర్మించే శస్త్ర చికిత్స కూడా చేయొచ్చని ఆమె తెలిపారు. 'దీని వల్ల కలిగే ప్రధాన ప్రయోజనం ఏమిటంటే, రోగి శారీరక రూపంలో పెద్దగా మార్పు ఉండదు. ఇది మహిళల ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడుతుంది' అని డాక్టర్ మంజుల అభిప్రాయపడ్డారు.





పచ్చి మిరపకాయలతో ఆరోగ్యం.. రోజూ తింటే

భారతీయులు స్పైసీ ఫుడ్స్ తినడానికి ఇష్టపడతారు. అందుకే పచ్చి మిరపకాయలను ప్రతి ఆహారంలో ఉపయోగిస్తారు. పచ్చిమిర్చిని ప్రతిరోజూ ఆహారంలో తీసుకుంటే శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

పచ్చిమిర్చిలో ఉండే గుణాలు అనేక రకాల ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి. మిరపకాయలో ఉండే గుణాలు శరీరానికి చాలా పోషకాలను అందిస్తాయి. ముఖ్యంగా తరచుగా అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజూ పచ్చిమిర్చిని తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ పచ్చిమిర్చి తినడం వల్ల శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.

కొలెస్ట్రాల్ సమస్యలకు చెక్: పచ్చిమిర్చిలో ఉండే క్యాప్సైసిన్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను సులభంగా నియంత్రించగలదు. అంతేకాదు, రక్తంలో కొలెస్ట్రాల్ చేరడం వల్ల కలిగే అధిక రక్తపోటును కూడా ఇది సులభంగా ఉపశమనం చేస్తుంది. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవాలనుకునే వారు ప్రతిరోజూ పచ్చిమిర్చిని ఆహారంలో తప్పనిసరిగా తీసుకోవాలి.

క్యాన్సర్ నుండి రక్షిస్తుంది: ప్రతిరోజూ పచ్చిమిర్చి తీసుకునేవారిలో క్యాన్సర్ ముప్పు 50 శాతం తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అంతే కాకుండా పచ్చిమిర్చి శరీరాన్ని క్యాన్సర్ బారిన పడకుండా కాపాడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నుండి: చాలా మందికి తరచుగా ఆరోగ్య సమస్యలు ఉంటాయి. దీని వల్ల కొంత మంది దీర్ఘకాలిక వ్యాధుల బారిన కూడా పడుతున్నారు. కానీ అలాంటి వారికి పచ్చిమిర్చి ఎఫెక్టివ్‌గా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

రోగనిరోధక శక్తిని పెంచుతుంది: చలికాలంలో ప్రజలు తరచుగా అనారోగ్యానికి గురవుతారు. అలాంటివారు ప్రతిరోజూ పచ్చిమిర్చిని ఆహారంలో తీసుకోవాలి. దీని గుణాలు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని ఉపశమనం చేస్తాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 07.11.2026
www.mudranews.in | @mudranews

ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు



ఆహారం మింగడంలో ఇబ్బంది, కారణం తెలియకుండా బరువు తగ్గడం, ఛాతీలో నిరంతర నొప్పి, పదేపదే వాంతులు కావడం, వాంతుల్లో రక్తం కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే ఎండోస్కోపీ, బయాప్సీ పరీక్షలు చేయించుకోవాలి.

కుప్పకూలిన స్టాక్‌మార్కెట్లు..

ట్రిలియన్ డాలర్లు కోల్పోయిన టెకీ కంపెనీలు



ముద్ర, న్యూయార్క్: అమెరికాలో మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు జయకేతనం ఎగురవేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆ దేశ స్టాక్‌మార్కెట్ల(US Stocks)లో ట్రిలియన్ల డాలర్లు ఆవిరైపోతున్నాయి. అమెరికా, యూరోప్, ఆసియా దేశాల్లోని టెకీ సంస్థలపై మిడ్‌టర్మ్ ఫలితాలు దారుణమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్‌మెంట్ మందగిస్తుందన్న భయాందోళనల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికాలో నాస్‌డాక్ షేర్లు 5.5 శాతం పడిపోయాయి. దీంతో సుమారు 2.5 ట్రిలియన్ల డాలర్ల మార్కెట్ నష్టపోయినట్లు తెలుస్తోంది. నాస్‌డాక్‌తో పాటు ఇతర అమెరికా స్టాక్ ఇండెక్స్‌ల్లోనూ భారీ పతనం నమోదు అయ్యింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆంక్షలు కఠినం చేసే అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటును డెమోక్రాట్లు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఏఐపై పెట్టుబడి పెట్టేందుకు వెనుకడుగు వేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా టెకీ కంపెనీల షేర్లు షేక్ అయ్యాయి. ఏఐపై భారీగా పెట్టుబడి పెడితే, దానికి తగిన లాభాలు వస్తాయా రావా అన్న ఆలోచనల్లో మదుపరులు ఉన్నట్లు తెలుస్తోంది.అమెరికాలో మ్యాగ్నిఫిషియంట్ సెవన్ టెకీ కంపెనీల్లో భాగమైన యాపిల్, ఎన్విడియా, టెస్లా కంపెనీలు ట్రేడింగ్‌లో ట్రిలియన్ డాలర్లు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఎన్విడియా కంపెనీ షేర్లు 9 శాతం పడిపోయాయి. ఇతర చిప్ తయారీ కంపెనీలు కూడా ఇబ్బందిపడ్డాయి. ఏఎండీ, మైక్రాన్ కంపెనీల షేర్లు దాదాపు 17 శాతం కుప్పకూలాయి. బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల్లో షేర్లు 8, 11 శాతం పడిపోయినట్లు గుర్తించారు. దీంతో ఆ రెండు కంపెనీలకు చెందిన సుమారు 300 బిలియన్ల డాలర్ల మార్కెట్ వాల్యూ పడిపోయింది. రిపబ్లికన్ పార్టీ ప్రచారం కోసం మస్క్ సుమారు 450 మిలియన్ల డాలర్లు ఖర్చు చేశారు. దీంట్లో టెక్సాస్ సేనేట్ అభ్యర్థి కెన్ పాక్స్‌టన్ కోసం 45 మిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టారు. కానీ అక్కడ డెమోక్రటిక్ అభ్యర్థి గెలుపొందారు.యురోప్‌కు చెందిన టెకీ కంపెనీ, చిప్‌మేకర్ ఇన్‌ఫినియాన్ షేర్లు కూడా 8.5 శాతం పడిపోయాయి. ఇక టెకీ ఎక్విప్‌మెంట్ తయారీ సంస్థ ఏఎస్‌ఎంఎల్ కంపెనీ షేర్లు 6.5 శాతం తగ్గాయి. శుక్రవారం ఏషియన్ మార్కెట్లు కూడా వణికిపోయాయి. జపాన్‌లో నిక్కీ షేర్ ఇండెక్స్ 6 శాతం పడిపోయింది. మెమోరీ చిప్ తయారీ సంస్థలు కియాక్సియా, టోక్యో ఎలక్ట్రాన్ కంపెనీ షేర్లు భారీగా పతనం అయ్యాయి. దక్షిణ కొరియాలో చిప్‌మేకర్ ఎస్‌కే హైనిక్స్ 10 శాతం, శాంసంగ్ 6.4 శాతం షేర్లు డౌనయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఖర్చులపై భయాందోళనల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కుదేలు అయినట్లు మార్కెట్‌వాచ్ నిపుణుడు బ్రిట్నీ నుయెన్ తెలిపారు.

అక్రమ టపాసులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

రూ.1.75 లక్షల విలువైన బాణసంచా స్వాధీనం



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 6 : నగరంలో దీపావళి పండుగ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచి విక్రయిస్తున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ ఆదేశాల మేరకు, సీఐ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో బుర్హన్‌పు రంలోని నాగ వెంకటసాయి కిరాణా దుకాణంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన సుమారు రూ. 1,75,000/– విలువైన దీపావళి టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఆ బాణసంచాను ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎలాంటి లైసెన్సులు లేదా అనుమతులు లేకుండా టపాసులను నిల్వ ఉంచడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు పెను ప్రమాదం కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘించే వారిపై భవిష్యత్తులోనూ కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. దీపావళి పండుగను ప్రజలందరూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా జరుపుకోవాలని, కేవలం ప్రభుత్వ అనుమతి పొందిన అధికారిక విక్రయ కేంద్రాల నుంచే టపాసులు కొనుగోలు చేయాలని సూచించారు. ఎక్కడైనా ఎవరైనా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా లేదా విక్రయించిన సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని ఆయన కోరారు.

భవితా కేంద్రాల పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లోనూ సమాన అవకాశాలు



కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భవితా కేంద్రాల పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లోనూ సమాన అవకాశాలు, క్రీడల్లో గెలుపోటముల కంటే పాల్గొనడం, ఆత్మవిశ్వాసం ముఖ్యమని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భవితా కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడా దినోత్సవం పిల్లల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం, ఐక్యతను పెంపొందించే ముఖ్యమైన కార్యక్రమమని తెలిపారు. క్రీడల్లో గెలుపోటముల కంటే పాల్గొనడం,తమ ప్రతిభను ప్రదర్శించడం ఎంతో ముఖ్యమని పిల్లలకు సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఇతర పిల్లలతో సమానంగా చదువుకోవడంతో పాటు క్రీడల్లో కూడా రాణించగలరని తెలిపారు. వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి, సరైన శిక్షణ,ప్రోత్సాహం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.పారా ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని తెలిపారు. భవితా కేంద్రాల పిల్లలకు కూడా క్రీడల్లో ఉన్న అవకాశాలను పరిచయం చేసి,వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని సూచించారు. పారా ఒలింపిక్స్‌లో రాణించిన క్రీడాకారుల విజయగాథలను పిల్లలకు వీడియోల ద్వారా చూపించి, వారిలో స్ఫూర్తి నింపాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు.జిల్లాలోని అన్ని భవిత కేంద్రాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రత్యేక విద్యావసరాలు కలిగిన పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పిల్లలకు విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో సమగ్ర అభివృద్ధి కల్పించేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులను అభినందిస్తూ, పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. పిల్లలను క్రీడా కార్యక్రమాలకు తీసుకురావడానికి తల్లిదండ్రులు చేస్తున్న కృషి, సహకారం ఎంతో విలువైనదని అన్నారు.క్రీడా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా విద్యాశాఖ అధికారికి, ప్రోగ్రామ్ అధికారికి, భవిత కేంద్రాల ఇంచార్జీలకు,ప్రత్యేక విద్య ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. క్రీడల్లో విజేతలైన పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,పాల్గొన్న ప్రతి ఒక్కరూ అభినందనలకు అర్హులని పేర్కొన్నారు.క్రీడల్లో గెలుపొందడం మాత్రమే విజయానికి ప్రమాణం కాదని, పాల్గొనడం, ప్రయత్నించడం, పట్టుదలతో ముందుకు సాగడం నిజమైన విజయమని పిల్లలకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి, సమ్మిళిత విద్య సమన్వయకర్త పెసరు లింగారెడ్డి, భువనగిరి మండల విద్యాధికారి సిహెచ్ రంగరాజన్, రాయగిరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ అండాలు,భవిత కేంద్రాల ఇంచార్జీలు, ప్రత్యేక విద్య, క్రీడా విద్య ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెటాలోనూ స్వచ్ఛంద నిష్క్రమణ



మైక్రోసాఫ్ట్, గూగుల్ బాటలో సోషల్ మీడియా దిగ్గజం

ముద్ర, న్యూయార్క్ : మొన్నటి దాకా టెక్ దిగ్గజ కంపెనీలు లేఆఫ్‌ల పేరుతో ఉద్యోగులను తీసేయగా.. ఇప్పుడు వలంటరీ ఎగ్జిట్ (స్వచ్ఛంద నిష్క్రమణ) అంటున్నాయి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్ ప్రకటించగా ఇప్పుడు మెటా ఈ లిస్టులోకి చేరింది. ఫ్రాన్స్‌లోని ఉద్యోగులకు వలంటరీ ఎగ్జిట్ ఆఫర్ ఇచ్చింది. ఫ్రెంచ్ కార్మిక చట్టాల ప్రకారం ఉద్యోగ సంఘాలతో చర్చించి ఈ ఆఫర్‌ను అమలు చేస్తారు. ఫ్రాన్స్‌లో మెటాకు ప్రస్తుతం 300 మంది ఉద్యోగులుండగా ఇందులో కనీసం 100 మందిని ఈ ఆఫర్‌తో తొలగించే అవకాశం ఉన్నది. ఈ ఆఫర్‌లో ఉద్యోగి పనిచేసిన ప్రతి ఏడాదికి 2.15 నెలల జీతం, 10 నెలల మొబిలిటీ లీవ్‌తో పాటు కొత్త ఉద్యోగానికి సాయం అందిస్తారు. వ్యాపారం చేయాలనుకునే వారికి సాయం అందించే యోచనాను మెటా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

యుద్ధం ముగింపునకు రూ.4.8 లక్షల కోట్ల డిమాండ్



ముద్ర, సౌదీ: యుద్ధం ముగించడానికి ఏం కావాలో తెలపాలని సౌదీ ప్రభుత్వం గురువారం హౌతీ తిరుగుబాటుదారులను కోరింది. 51 బిలియన్ డాలర్లు(సుమారు రూ.4.8 లక్షల కోట్లు) ఇవ్వడంతో పాటు తమను యెమెన్‌కు చట్టబద్ధమైన పాలకులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.దుబాయ్: యుద్ధం ముగించడానికి ఏం కావాలో తెలపాలని సౌదీ ప్రభుత్వం గురువారం హౌతీ తిరుగుబాటుదారులను కోరింది. 51 బిలియన్ డాలర్లు(సుమారు రూ.4.8 లక్షల కోట్లు) ఇవ్వడంతో పాటు తమను యెమెన్‌కు చట్టబద్ధమైన పాలకులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.

సౌదీ నేతృత్వంలో వైమానిక దాడులు, సుదీర్ఘ దిగ్బంధనం కారణంగా జరిగిన నష్టాలకు పరిహారంగా ఈ మొత్తాన్ని ఇవ్వాలని హౌతీలు డిమాండ్ చేశారు. అయితే హౌతీలపై మరింత బలమైన సైనిక పట్టు సాధించకుండా సమగ్ర ఒప్పందం చేసుకోవడానికి సౌదీ యువరాజు బిన్ సల్మాన్ సుముఖంగా లేరని సమాచారం.

ట్రంప్‌పై తిరుగుబావుటా..!

మధ్యంతర ఎన్నికల్లో ఓటమితో సొంత పార్టీ నుంచే విమర్శలు
ఓటమికి అధ్యక్షుడి విధానాలే కారణమని ఆరోపణలు
మాగా శిబిరంలోనూ వ్యతిరేకత



ముద్ర, వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయం నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సొంత పార్టీ నేతలే తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ ఫలితాలు అధ్యక్షుడి నాయకత్వానికి ప్రజలు ఇచ్చిన తిరస్కారమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఓ సీనియర్ రిపబ్లికన్ నేత ఈ ఓటమిని అత్యంత తీవ్రస్థాయి విపత్తుగా అభివర్ణించారు. పార్టీ ఓటమికి ట్రంప్ విధానాలు, ఆయన వ్యవహారశైలే కారణమని ఆరోపించారు. డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధుల సభతోపాటు సెనెట్‌లోనూ ఆధిక్యం సాధించింది. టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి సంప్రదాయ రిపబ్లికన్ రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు విజయాలు నమోదు చేశారు. దీంతో పార్టీ నేతల్లో తొలుత కనిపించిన దిగ్భ్రాంతి క్రమంగా ట్రంప్‌పై అసంతృప్తిగా మారింది. టెక్సాస్‌కు చెందిన ప్రముఖ రిపబ్లికన్ లాబీయిస్టు బిల్ మిల్లర్ మాట్లాడుతూ.. ఈ ఓటమికి ట్రంప్ తప్ప మరెవరూ బాధ్యులు కాదని వ్యాఖ్యానించారు. ఇది అధ్యక్షుడిని ప్రజలు పూర్తిగా తిరస్కరించినట్లేనని, ఫలితాలు ఊహించని స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు.

ఇరాన్ యుద్ధం, సుంకాలపై ఆగ్రహం

ట్రంప్ విధానాలు ఓటర్లను పార్టీకి దూరం చేశాయని రిపబ్లికన్ వ్యూహకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్‌తో యుద్ధం, దిగుమతి సుంకాలు, వలసలపై కఠిన చర్యలు ప్రజల్లో అసంతృప్తిని పెంచాయని అంటున్నారు. యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం, జీవనవ్యయం వంటి అంశాలు ఎన్నికల్లో ప్రభావం చూపాయని పేర్కొంటున్నారు. మిన్నెసోటా రిపబ్లికన్ వ్యూహకర్త గ్రెగ్ పెప్పిన్ మాట్లాడుతూ.. పార్టీ ప్రచారంలో పరుస తప్పిదాలు జరిగాయని, పలు రాష్ట్రాల్లో ఓటర్లు అధ్యక్షుడి విధానాలను తిరస్కరించారని అన్నారు. మరోవైపు, వైట్‌హౌస్‌కు సన్నిహితంగా ఉన్న ఓ వ్యక్తి కూడా ఇరాన్ యుద్ధం, సుంకాలు, వలసలపై ప్రభుత్వ వైఖరి కలిసి పార్టీకి రాజకీయంగా నష్టం కలిగించాయని పేర్కొన్నారు.

మాగాలో అంతర్యుద్ధం

మధ్యంతర ఎన్నికల్లో పరాజయం నేపథ్యంలో ట్రంప్‌కు సొంత రాజకీయ శిబిరం నుంచే వ్యతిరేకత ఎదురవుతున్నది. ట్రంప్‌కు బలమైన మద్దతుదారులుగా ఉన్న మాగా(మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) వర్గానికి చెందిన పలువురు ప్రముఖులు ఇప్పుడు ఆయన విధానాలనే తప్పుబడుతున్నారు. ఇరాన్‌తో యుద్ధం, స్వేచ్ఛావాద ఓటర్లను దూరం చేసుకోవడం, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకపోవడం పార్టీ ఓటమికి కారణమని విమర్శిస్తున్నారు. ప్రముఖ రైట్‌వింగ్ వ్యాఖ్యాత అలెక్స్ జోన్స్ ట్రంప్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆయన డెమోక్రాట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ట్రంప్‌తో వందశాతం యుద్ధం చేస్తున్నా అని ప్రకటించారు.

బంగ్లాదేశ్‌లో భారతీయ వైద్య విద్యార్థి అదృశ్యం

కాలేజీ సమీపంలోని చెరువులో మృతదేహం



ముద్ర, శ్రీనగర్: బంగ్లాదేశ్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న భారత్‌కు చెందిన వైద్య విద్యార్థి అదృశ్యమయ్యాడు. రెండు రోజుల తర్వాత మెడికల్ కాలేజీ సమీపంలోని చెరువులో అతడి మృతదేహం కనిపించింది. కుమారుడితో పాటు బంగ్లాదేశ్‌లో ఉంటున్న తల్లి అతడి మరణ వార్త తెలుసుకుని ఆసుపత్రిపాలైంది. జమ్ముకశ్మీర్‌లోని సోపోర్‌కు చెందిన 26 ఏళ్ల అద్నాన్ అల్తాఫ్, బంగ్లాదేశ్‌లోని ఈస్టర్న్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఇటీవల కశ్మీర్‌కు వచ్చిన అతడు 15 రోజుల కిందట తల్లితో కలిసి చదువు కోసం తిరిగి బంగ్లాదేశ్ వెళ్లాడు.కాగా, నవంబర్ 2న క్యాంపస్ నుంచి అద్నాన్ బయటకు వెళ్లాడు. అక్కడి ఇండియన్ రెస్టారెంట్‌లో డిన్నర్ చేశాడు. ఆ తర్వాత అతడు అదృశ్యమయ్యాడు. ఢాకా–చటోగ్రామ్ హైవేలోని మెడికల్ కాలేజీ సమీపంలో ఉన్న మోనిపూర్ గ్రామంలోని చెరువులో భారత విద్యార్థి మృతదేహం లభించింది. పోస్ట్‌మార్టం పరీక్ష కోసం కమిల్లా మెడికల్ కాలేజీ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.మరోవైపు అద్నాన్ కొంత కాలంగా మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని ఈస్టర్న్ మెడికల్ కాలేజీ యాజమాన్యం తెలిపింది. కుమారుడిని చూసుకునేందుకు తల్లి కూడా అతడితో పాటు ఉంటున్నట్లు పేర్కొంది. 15 రోజుల క్రితమే వారిద్దరూ భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చినట్లు వివరించింది. నవంబర్ 4 నుంచి ప్రారంభం కావాల్సిన రెండో ప్రొఫెషనల్ ఎంబీబీఎస్ మైక్రోబయాలజీ పరీక్షలకు అద్నాన్ హాజరు కావాల్సి ఉన్నదని కాలేజీ అధికారులు వెల్లడించారు.అయితే బంగ్లాదేశ్‌లో ఉంటున్న అద్నాన్ తల్లి కుమారుడి మరణం గురించి తెలుసుకుని తీవ్ర మనోవేదనతో ఆసుపత్రిపాలైంది. ఆమె ఆరోగ్యం నిలకడగా లేదని జమ్ముకశ్మీర్‌లోని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అద్నాన్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం సహకరించాలని వారు విన్నవించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 7.11.2026
www.mudranews.in | @mudranews

వేడి పానీయాలు తాగే ముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

టీ, కాఫీ తయారు చేసిన వెంటనే తాగకూడదు. ఆవిరి వస్తున్నప్పుడే సిప్ చేయకుండా కొద్దిసేపు చల్లార నివ్వాలి. నోరు, నాలుక లేదా గొంతు కాలేంత వేడిగా ఉన్న పానీయాలకు దూరంగా ఉండాలి. సౌకర్యంగా తాగగలిగేంత వెచ్చగా మారిన తర్వాతే తీసుకోవాలి.



మా డిమాండ్ కు తలొగ్గే ఎస్టీలకు ప్రత్యేక కమిషన్

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ముద్ర, హైదరాబాద్:తెలంగాణ రక్షణ సేన డిమాండుకు తలొగ్గే ప్రభుత్వం ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ లో ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్లను కలిపి ఒకే కమిషన్ గా ఏర్పాటు చేయడంతో అటు ఎస్సీలకు, ఇటు ఎస్టీలకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు తాము ప్రశ్నించామని గుర్తు చేశారు. సమాజంలో ఎస్సీలు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సామాజిక, భౌగోళిక సమస్యలు పూర్తిగా వేర్వేరుగా ఉన్నాయన్నారు. నేటికీ ఎస్సీలు సమాజంలో పీడన, అణచివేత, దౌర్జన్యాలను ఎదుర్కొంటుంటే, మరోవైపు ఆదివాసీలను రకరకాల పేర్లతో అడవి నుంచి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. గిరిజనులు తమ అస్తిత్వమైన 'జల్–జంగల్–జమీన్'పై హక్కులను కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఆదివాసీలు, గిరిజన సమాజం అభ్యున్నతి కోసం ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వారికి మంచి చేస్తుందన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎస్టీ కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని, వారి ఆత్మగౌరవాన్ని, విశిష్టమైన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

*** హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్**
*** కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ కు ఎ గ్రేడ్ రూ.2,461**
*** చిగురుమామిడి మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం**



ముద్ర చిగురుమామిడి: ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోని ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ కోరారు.శుక్రవారం చిగురుమామిడి మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి వారు ఘనంగా ప్రారంభించారు.మండల కేంద్రమైన చిగురుమామిడిలో ఐకెపి ఆధ్వర్యంలో, సుందరగిరి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో,అలాగే లంబాడిపల్లి,గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ తోపాటు తదితర గ్రామాల్లో ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రవీందర్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకుని మోసపోవద్దని హెచ్చరించారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు సరైన న్యాయం జరుగుతుందని, ఎ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2,461మద్దతు ధర లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.రైతులు తాము పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకే తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కనకయ్య,ఎంపీడీవో రామ్మోహన్ చారి,ఆయా గ్రామాల సర్పంచులు కాటం సంపత్ రెడ్డి,ఆకవరం భవాని శివప్రసాద్,జంగ శిరీష వెంకటరమణారెడ్డి, సన్నీల్ల కవిత వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,ఏపీఎం రజిత, డైరెక్టర్లు కోటు మల్లారెడ్డి, బొమ్మగాని పరశురాములు, కుతాటి తిరుపతి,సొసైటీ సీఈఓ చేపూరి కుమార్,ఉపసర్పంచులు కాశబోయిన విజయలక్ష్మి రాజు యాదవ్, మెడబోయిన రాజు, నక్క ఓదెల్, వడ్లకొండ నరేందర్ రెడ్డి,సెంటర్ నిర్వాహకులు గట్టు ప్రశాంత్,కర్ర అశోక్ రెడ్డితోపాటు,వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు,ఐకేపీ, డీసీఎంఎస్,సింగిల్ విండో అధికారులు,స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



ముద్ర, జయశంకర్ భూపాలపల్లి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , డీఆర్వో వసంతకుమారి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు పలువురు అధికారులు కలెక్టర్ కు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు

మంథని: విద్యార్థులకు చట్టాల పట్ల అవగాహన కల్పించాలనే లక్ష్యంతో మంథని గర్ల్స్ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి. అనురాధ, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె. రఘోత్తం రెడ్డి, న్యాయవాది శశిభూషణ్ కాచే, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఝాన్సీ, రావుల తిరుమల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు చట్టాలు, వాటి ప్రాముఖ్యత, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

ఎలక్ట్రానిక్ కాంటాను తాకడంతో విద్యుదాఘాతం.. చిన్నారి మృతి

ముద్ర, జగిత్యాల : జగిత్యాల జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇంట్లో ఆడుకుంటూ విద్యుదాఘాతానికి గురై 10 నెలల చిన్నారి మృతిచెందింది. ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. తిరుపతి అనే వ్యక్తి ఇంట్లో కుటుంబసభ్యులు ఎలక్ట్రానిక్ కాంటాను ఛార్జింగ్ పెట్టారు. ఈ క్రమంలో తిరుపతి కుమార్తె విభూది ఆద్య ఆడుకుంటూ వెళ్లి ఎలక్ట్రానిక్ కాంటాను తాకింది. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి

జనవరి మొదటి వారంలోగా సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం పూర్తి చేయాలి
మార్చి నెలాఖరులోగా VBGRAMG ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం
వేసవి ముగిసే వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

ముద్ర, పెద్దపల్లి : ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరును మరింత మెరుగుపరచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. విద్య, ఉపాధి హామీ, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, చేయూత పింఛన్ల వెరిఫికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, నిర్దేశిత లక్ష్యాల సాధనపై సీఎస్ సమీక్షించారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు శ్రీరాములు, అరుణశ్రీ ఐడీఓసీ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నిధుల వినియోగంలో వేగం పెంచాలి

సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద కేటాయించిన నిధులను జనవరి మొదటి వారంలోగా గరిష్టంగా వినియోగించాలని సీఎస్ ఆదేశించారు. పీఎం శ్రీ పథకం కింద రూ.538 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు 10 శాతం కూడా ఖర్చు కాలేదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 794 పీఎం శ్రీ పాఠశాలల్లో నిధుల వినియోగంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ఫలితాల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు.

2026–27 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.1,763 కోట్లు కేటాయించగా, ఇప్పటివరకు రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలిపారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులను సమగ్ర శిక్ష, VBGRAMG పథకాల సమన్వయంతో చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో యూనిఫారాలు, విద్యార్థుల కిట్ల పంపిణీ వచ్చే విద్యా సంవత్సరం



ప్రారంభంలోనే పూర్తయ్యేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాల అమలు, విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత

వేసవి కాలం ముగిసే వరకు ప్రతి ప్రాంతంలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్ స్పష్టం చేశారు. సింగూరు ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా నీటిని అందించేందుకు సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు రూ.20 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ బోర్‌వెల్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, అవసరమైన చోట కొత్త బోర్‌వెల్ల ఏర్పాటు వంటి చర్యలను నవంబర్ 15లోగా పూర్తి చేయాలన్నారు.

ప్రతి జిల్లాలో జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి వారానికోసారి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు నీటి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో ప్రెజర్ వాల్వ్‌లను పర్యవేక్షించాలని, నీటి వృథా, అక్రమ కనెక్షన్లను అరికట్టాలని తెలిపారు.

12 కోట్ల పనిదినాల కల్పనే లక్ష్యం

VBGRAMG పథకం ద్వారా ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. గత రెండేళ్లతో పోలిస్తే ఉపాధి కల్పనలో పురోగతి సాధించామని పేర్కొన్నారు. మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని చేరుకోవాలని, చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఇప్పటివరకు 43 వేల ఇళ్లకు మాత్రమే మంజూరు చేశామని, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లు, మొదటి విడతలో లక్ష ఇళ్ల మంజూరు ప్రక్రియ పెండింగ్‌లో ఉందని సీఎస్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని సూచించారు. ఇందుకోసం 'మన ఇసుక–3 మన వాహనం' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. అలాగే సిమెంట్ బస్తాను రూ.230కే సరఫరా చేయాలని, ఒక్కో బస్తాపై లబ్ధిదారులకు రూ.100 వరకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వ రాయితీలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు.

దీపావళి సందర్భంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా పూర్తయిన ఇళ్లకు కొత్త లోగోతో స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, ఈ కార్యక్రమాన్ని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ప్రతి జిల్లా పనితీరు మెరుగుపడాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని సీఎస్ సంజయ్ జాజు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన నూతన క్యాలెండర్-2027 ఆవిష్కరణ

ముద్ర, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నూతన సంవత్సర క్యాలెండర్–2027ను అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తరపున భక్తులకు అందజేసేందుకు ఒక్కో క్యాలెండర్‌ను రూ.100 చొప్పున అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అంతకుముందు భీమేశ్వరాలయానికి చేరుకున్న ఆది శ్రీనివాస్‌కు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వచనాలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈవో రమాదేవి, డీఈవో ప్రతాప నవీన్ కుమార్ శేషవస్త్రం, స్వామివారి లడ్డూ ప్రసాదాలను ఆది శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు భూపాలపల్లి విద్యార్థినులు

ముద్ర, భూపాలపల్లి: వరంగల్‌లోని దేశాయిపేట హైస్కూల్‌లో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చాటారు. రేగొండ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అండర్–14 విభాగంలో వై. అంజలి, అండర్–17 విభాగంలో ఎం. గౌతమి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీహెచ్. రఘు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విజిత, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని రఘు ఆకాంక్షించారు.

గంజాయి మత్తుపదార్థాల రహిత సమాజమే లక్ష్యం

*** శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపేట చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక..**
*** ఇందుర్తి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సమావేశంలో కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్ కుమార్ వెల్లడి..**

ముద్ర చిగురుమామిడి : కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా గ్రామంలోని ప్రతి వీధిలో తనిఖీలు చేపట్టి అనుమానిత వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు వెల్లడించవద్దని సూచించారు. మహిళలపై వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాహనదారులు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు



పాటించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ అనిల్, కొత్తపల్లి సీఐ బిల్లా కోటేశ్వర్, చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్, సర్పంచ్ చింతపూల నరేందర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మందికి పైగా గ్రామస్తులు హాజరై పోలీసుల సూచనలను పాటిస్తామని హామీ ఇచ్చారు.

పోలీసుల ఆరోగ్య భద్రతకు 'ఫిట్ కాప్' కార్యక్రమం

90 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికి ఆరోగ్య పర్యవేక్షణ
ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి వైద్య సూచనలు
పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజానికి మెరుగైన సేవలు: డీజీపీ సీవీ ఆనంద్

ముద్ర, హైదరాబాద్ : నిరంతర విధులు, పని ఒత్తిడి మధ్య పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపలేకపోతున్నారని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించగలరని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 'ఫిట్ కాప్' కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్‌తో పాటు ఇతర సంస్థల సహకారంతో రూపొందించిన ఈ కార్యక్రమంపై శుక్రవారం డీజీపీ కార్యాలయంలో పోలీసు అధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌గా రూపొందించిన ఈ కార్యక్రమం ప్రత్యేక మొబైల్ యాప్ ఆధారంగా పనిచేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది తమ మొబైల్ నంబర్ ఆధారంగా యాప్‌లో ఆరోగ్య వివరాలను నమోదు చేసుకోవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), ఇతర ఆరోగ్య సమస్యలు, జీవనశైలి అలవాట్లు, శారీరక శ్రమ, ధూమపానం, మద్యపానం తదితర అంశాలపై సమాచారం సేకరిస్తారు. ఈ వివరాల ఆధారంగా సిబ్బందిని తక్కువ, మధ్యస్థ, అధిక ఆరోగ్య ముప్పు విభాగాలుగా గుర్తిస్తారు.

ఆరోగ్య సమస్యలపై ముందస్తు అప్రమత్తత

ఆరోగ్య ప్రమాద స్థాయిని బట్టి కాల్‌సెంటర్ ద్వారా సంబంధిత పోలీసు సిబ్బందికి సమాచారం అందిస్తామని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రుల్లో చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కిడ్నీ సమస్యలు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని డీజీపీ వివరించారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

పోలీసు సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వ్యాధులు తీవ్రమవకముందే నివారణ చర్యలు చేపట్టడం ఫిట్ కాప్ ప్రధాన ఉద్దేశమని సీవీ ఆనంద్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు విభాగాల్లో ఈ కార్యక్రమాన్ని



సమర్థంగా అమలు చేస్తామని, ప్రతి పోలీసు ఉద్యోగి ఆరోగ్య పరిరక్షణలో ఫిట్ కాప్ కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఏడీజీ అకున్ సబర్వాల్, ఐజీపీ పి. అండ్ ఎల్ గజరావు భూపాల్, భద్రత, ఆరోగ్య భద్రత కార్యదర్శి ఉదయ్ కుమార్ రెడ్డి (రిటైర్డ్), టి–స్పార్క్ ఎస్పీ రూపేష్, ఎస్పీ అవినాష్, ఇతర పోలీసు అధికారులు, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 07.11.2026
www.mudranews.in | @mudranews

జీఓ 59 దరఖాస్తుల విచారణను వేగవంతం చేయాలి

కలెక్టర్ దివాకర

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 6 : జీఓ 59 క్రింద భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన పెండింగ్ దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. అర్హులైన దరఖాస్తుదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 500 గజాల లోపు ఉన్న ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రభుత్వం అందించిన జాబితా ప్రకారం జిల్లాలోని వివిధ మండలాల నుండి విస్తృతంగా దరఖాస్తులు వచ్చాయని సత్తుపల్లిలో 1662, ఖమ్మం అర్బన్‌లో 1,255, కూసుమంచిలో 445, ఖమ్మం రూరల్‌లో 270, వేంసూరులో 266, కల్లూరులో 213, రఘునాథపాలెంలో 212, మధిరలో 206, పెనుబల్లిలో 216, వైరాలో 193,



చింతకానిలో 151, కొణిజెర్లలో 84, తిరుమలాయ పాలెంలో 79, ముదిగొండలో 82, తల్లాడలో 39, కామేపల్లిలో 8, నేలకొండపల్లిలో 7, సింగరేణిలో 3, బోనకల్‌లో 2, ఎర్రుపాలెంలో 12 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ దరఖాస్తుల న్నింటినీ క్షేత్రస్థాయిలో వేగంగా పరిశీలించేందుకు గాను 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ బృందాల్లో 17 మంది జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించామని, వారికి అవసరమైన శిక్షణ పూర్తి చేసిన అనంతరం 30 రోజుల్లోగా విచారణ ప్రక్రియను ముగించాలని ఆదేశించినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారులు వారికి కేటాయించిన దరఖాస్తులను పరిశీలిస్తూ విచారణను వేగంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. విచారణ సమయంలో దరఖాస్తుదారులు అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించి, అవసరమైన ధృవీకరణ పత్రాలు, సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి తగిన ఆధారాలతో భూములను క్రమబద్ధీకరించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఒకే రైలులో ఏడు జ్యోతిర్లింగాల దర్శనం

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : తీర్థయాత్రలు చేయాలనుకునే భక్తుల సౌకర్యార్థం భారతీయ రైల్వే ఆధ్వర్యంలోని ఐఆర్ సీటిసి టూరిజం భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం నవంబర్ 10 నుంచి డిసెంబర్ 27 వరకు నాలుగు ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్ర ప్యాకేజీలను నిర్వహించనున్నట్లు ఐఆర్సీటీసీ టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ తెలిపారు. గురువారం భువనగిరి రైల్వేస్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యాత్రల వివరాలు, టికెట్ ధరలు, కల్పించే సౌకర్యాలను వెల్లడించారు.నాలుగు ప్రత్యేక యాత్ర ప్యాకేజీలు1. సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (SCZBG68)నవంబర్ 10 నుంచి 20 వరకు జరిగే ఈ యాత్రలో ఉజ్జయినిలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకలో నాగేశ్వర్, సోమనాథ్, పూణేలో భీమశంకర్, నాసిక్ లో త్రయంబకేశ్వర్, చత్రపతి సంభాజీనగర్లో ఘృష్ణేశ్వర్ జ్యోతిర్లింగాలను దర్శించుకోవచ్చు. టికెట్ ధరలు స్లీపర్ క్లాస్ రూ.18,000, 3 ఏసి రూ.27,400, 2 ఏసీ రూ.35,500గా నిర్ణయించారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముర్ఖడ్, నాందేడ్, పూర్ణ మీదుగా ప్రయాణిస్తుంది.2. దివ్య దక్షిణ యాత్ర జ్యోతిర్లింగంతో (SCZBG69)నవంబర్ 23 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించే ఈ యాత్రలో తిరువణ్ణమలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, చిదంబరం, తిరుచ్చి, తంజావూరు వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు. స్లీపర్ క్లాస్ రూ.15,800, 3 ఏసీ



రూ.23,200, 2 ఏసీ రూ.29,600గా టికెట్ ధరలు నిర్ణయించారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి చర్లపల్లి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్తుంది.3. అయోధ్య – కాశీ–బైద్యనాథ్ ధామ్ దర్శన్ యాత్ర (SCZBG70)డిసెంబర్ 5 నుంచి 14 వరకు జరిగే ఈ యాత్రలో పూరీ, కోణార్క్, బైద్యనాథ్ ధామ్, వారణాసి (కాశీ), అయోధ్య, ప్రయాగరాజ్ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు. స్లీపర్ క్లాస్ రూ.17,000, 3 ఏసీ రూ.26,400, 2 ఏసీ రూ.34,400గా ధరలు నిర్ణయించారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి చర్లపల్లి, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది.4. సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (SCZBG71):డిసెంబర్ 17 నుంచి 27 వరకు మరోసారి సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర నిర్వహించనున్నారు. ఈ యాత్రలో ఉజ్జయిని, ద్వారక, సోమనాథ్, పూణే, నాసిక్, ఛత్రపతి సంభాజీనగర్ లోని ప్రముఖ జ్యోతిర్లింగాలను దర్శించుకోవచ్చు. స్లీపర్ క్లాస్ రూ.18,000, 3 ఏసీ రూ.27,400, 2 ఏసీ రూ.35,500గా టికెట్ ధరలు నిర్ణయించారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్ధేడ్, నాందేడ్, పూర్ణ మీదుగా వెళ్తుంది.ఈ ప్యాకేజీల్లో రైలు ప్రయాణంతో పాటు స్థానిక బస్సు ప్రయాణం, హోటల్ వసతి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు, తాగునీటి సీసాలు, టూర్ ఎస్కార్ట్ సేవలు, సందర్శనా స్థలాలకు రవాణా, ప్రయాణ బీమా కల్పించనున్నారు. రైల్వే స్టేషన్ నుంచి దేవాలయాల వరకు రవాణా సౌకర్యం కూడా ప్యాకేజీలో భాగంగా ఉంటుంది. ప్రతి కోచ్కు ఒక భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు రైలులో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టనున్నారు.9701360701, 9281030744, 9281030734, 9281030727, 9281030759 నంబర్లను సంప్రదించి టికెట్లు బుక్ చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం www.irctctourism.com వెబ్సైట్ను సందర్శించాలని వెంకటేష్ సూచించారు. ఈ సమావేశంలో ఐఆర్సీటీసీ టూరిజం మానిటర్లు నరేష్ బాబు ఓర్సు, ప్రశాంత్, జయంత్ పాల్గొన్నారు.

డిజిటల్ పాలనతోనే వేగవంతమైన సేవలు

జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 6 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజిటల్ గవర్నెన్స్‌పై జిల్లా స్థాయి సమగ్ర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఉద్యోగుల నియామకం నుంచి పదవీ విరమణ వరకు అన్ని సేవలు, ప్రభుత్వ ఖర్చుల అనుమతులు, అభివృద్ధి పనుల ప్రక్రియ ఇకపై పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే పారదర్శకంగా జరుగుతాయన్నారు. డిజిటల్ మాడ్యూల్స్ అమలుతో ఫైళ్ల జాప్యం తగ్గి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని



తెలిపారు. జిల్లా ఖజానా కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాస్ రెడ్డి, పీఏఓ కె. రామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు సుమారు 650 మంది అధికారులు, ఖజానా సిబ్బంది హాజరయ్యారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జీనియస్ హై స్కూల్ కస్పాండెంట్ డాక్టర్ బి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. 14 నవంబర్ బాలల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రీడా పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత పెంపుందుతుందని అన్నారు ప్రతి విద్యార్థి ప్రతిరోజు ఏదో ఒక క్రీడల్లో పాల్గొనడం వల్ల మనసుకు ఉల్లాసంతో పాటు శారీరక అభివృద్ధి చెందుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి సుచరిత, ఏవో జి రవి, పీఈటీలు కే శ్రీకాంత్, కే కృష్ణ, కే మౌనిష, జి వనజ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై దాడి హేయమైన చర్య

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 6 : హైదరాబాద్ అల్మాస్‌గూడలో మహిళలపై జరిగిన భౌతిక దాడి తీవ్ర ఆవేదనకు గురిచేసిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ డిమాండ్ చేసింది. ముస్తాఫానగర్‌లో ఫౌండర్ పాస్టర్ వేముల సత్యం, జిల్లా ఐక్యవేదిక అధ్యక్షులు రేవరెండ్ జె. రాధాకృష్ణ, ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిషప్ సతీష్ కుమార్ అధ్యక్షతన జిల్లా కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వ్యక్తిని ప్రభుత్వం అరెస్టు చేయడాన్ని స్వాగతిస్తూనే, నిందితుడికి చట్టరీత్యా కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు అమల్లోకి తేవాలని, రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ చట్టాన్ని చేతుల్లోకి



తీసుకునే అల్లరి మూకలపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఇటువంటి దుశ్చర్యలను పౌర సమాజం, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమెన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ శాంతి, నాయకులు ప్రిస్కిల్లా, పద్మ, కృపార్, అబ్రహం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ డీఎస్పీగా రమేష్

ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీగా రమేష్ను క్రవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఎస్పీ డి.వి. శ్రీనివాస రావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.ఇప్పటి వరకు మెదక్ జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీగా విధులు నిర్వహించిన ఎ.సుభాష్ చంద్రబోస్ కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు.



డిసెంబర్ 29న 'ప్రజా గర్జన'



మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి
పోటు రంగారావు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 6 : : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో విఫలమైన రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 29న హైదరాబాద్ లో 'ప్రజా గర్జన' పేరిట భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రకటించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం పౌర హక్కులను కాలరాస్తూ, ప్రజా సంపదను కార్పొ రేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. ఓట్ల తొలగింపు, రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యం వంటి ఫాసిస్టు ధోరణులపై పౌర సమాజం తీవ్ర నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా హామీల అమలును విస్మరించిందని ఆరోపించారు. పెన్షన్ల పెంపు, ఉపాధి హామీ పనిదినాలను 250 రోజులకు పెంచి దినసరి కూలీ రూ.700 చేయడం, మహిళలకు నెలకు రూ.2,500, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం రూ.42,000 ఇవ్వడం సహా బకాయిపడ్డ స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తోందని, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన భద్రాద్రి, ఖమ్మం జిల్లాల రైతులకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం అందించి, వారి రుణాలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు సి.వై. పుల్లయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, రామయ్య, మీలీదు నాగేశ్వ రరావు, బండెల వెంకయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముద్ర, బీబీనగర్: బీబీనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పొటోల శ్యామ్ గౌడ్ పాల్గొని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.రైతులు పండించిన ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేందుకు, దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు ఈ కొనుగోలు కేంద్రాలు ఉపయోగపడనున్నాయి. మండలంలోని రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు



బైక్‌పై క్షేత్రస్థాయిలో మంత్రి తుమ్మల పర్యటన

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 6 : రైతు కష్టాన్ని నివేదికల కాగితాల్లో చూడటం కాకుండా, కళ్లారా చూసి తెలుసుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రదర్శించిన నిరాడంబరత స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. దమ్మపేట మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాన్ సృష్టించిన బీభత్సాన్ని పరిశీలించేందుకు ఆయన ఎంచుకున్న తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. విఐపి ప్రోటోకాల్ హంగులకు పూర్తిగా దూరంగా ఉంటూ, నెత్తిన టోపీ ధరించి, చేతిలో కర్ర పట్టుకుని ఒక సాధారణ పౌరుడిలా సహచరుని ద్విచక్ర వాహనం వెనుక కూర్చుని ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లారు.మండలంలో వర్షాల ధాటికి దెబ్బతిన్న రోడ్లతో పాటు, నీట మునిగి తీవ్రంగా నష్టపోయిన వరి, పండ్ల తోటలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారుల మాటలు లేదా నివేదికలపై మాత్రమే ఆధారపడకుండా, రైతులు అనుభవిస్తున్న కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఆయన గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ కారణంగా జరిగిన నష్టానికి సంబంధించిన పూర్తి నివేదికలను 24 గంటల్లోగా ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. ఒక రాష్ట్ర మంత్రి స్వయంగా బైక్‌పై తిరుగుతూ తమ వద్దకు వచ్చి కష్టాలను ఆలకించడంతో స్థానిక రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు..

సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలి

జిల్లా కలెక్టర్ దివాకర



ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 6 : దీపావళి పండుగను పర్యావరణహితంగా, సురక్షితంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఒక ప్రకటనలో కోరారు. శబ్ద, వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు గ్రీన్ క్రాకర్స్ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బాణాసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ భద్రతా జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా సింథటిక్ దుస్తులకు బదులుగా కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. విద్యుత్ తీగలు, ఇళ్లకు దూరంగా ఉన్న ఖాళీ స్థలాల్లో మాత్రమే టపాసులు కాల్చాలని, ఆ ప్రాంతంలో నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యవేక్షించాలని, వెలగని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయరాదని స్పష్టం చేశారు. ప్రమిదలు, దీపాలను మండే స్వభావం ఉండే వస్తువులకు దూరంగా ఉంచాలని, జంతువులకు ఇబ్బంది కలిగించేలా పెద్ద శబ్దాలు చేసే బాణాసంచా కాల్చకూడదని తెలిపారు. ప్రజలంతా బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాద రహిత దీపావళిని ఆస్వాదించాలని కలెక్టర్ కోరారు.

యువతే దేశానికి వెన్నెముక

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :



యువతే దేశానికి వెన్నెముక అని భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ అన్నారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక భువనగిరి కోట దగ్గర నిర్వహించిన జిల్లా యువజన ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని, యువతే దేశానికి వెన్నెముక లాంటి వారని అన్నారు. యువతలో దాగి ఉన్న కళా, సాంస్కృతిక, క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఈ యువజన ఉత్సవాలు ఒక మంచి వేదిక అని, లక్ష్యంపై గురి పెడితే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో ప్రారంభం కానున్న హుజూర్‌నగర్ ఇందిరమ్మ మోడల్ హౌసింగ్ కాలనీ

110 ఎకరాల్లో 2,160 ఇళ్ల నిర్మాణం
మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలి



ముద్ర, సూర్యాపేట, నవంబర్ 06: హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. హుజూర్‌నగర్ మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాల విస్తీర్ణంలో 2,160 ఇందిరమ్మ ఇళ్లతో ఈ మోడల్ హౌసింగ్ కాలనీని నిర్మిస్తున్నట్లు తెలిపారు.శుక్రవారం రామస్వామి గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న మోడల్ హౌసింగ్ కాలనీని మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సదుపాయం, వీధి దీపాలు, పచ్చదనం, తాగునీటి వసతి, పైలాన్ స్తూపం, సభాస్థలి తదితర ఏర్పాట్లను సమీక్షించారు. మిగిలిపోయిన పనులను వేగవంతంగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కాలనీలో పచ్చదనం పెంపొందించేందుకు నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించాలని, అవి ఎండిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు సహా అన్నీ మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని మంత్రి అధికారులకు సూచించారు. అత్యంత అర్హులైన పేదలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు, అక్రమాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీ రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఆర్డీవో శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 07.11.2026
www.mudranews.in | @mudranews

65 డిగ్రీల కంటే ఎక్కువ వేడి ప్రమాదకరం



65 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్న టీ, కాఫీలను తరచూ తాగడం వల్ల అన్నవాహిక క్యాన్సర్ ముప్పు పెరిగే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన IARC హెచ్చరించింది. అత్యంత వేడి పానీయాలను క్యాన్సర్‌కు సంబంధించిన ప్రమాద కారకంగా గ్రూప్ 2Aలో చేర్చింది.

అతివృష్టి, అనావృష్టి కాదు..

ముమ్మాటికీ రేవంత్ వృష్టి

ఢిల్లీకి మూటలు మోయడానికే డబ్బులు
ఎకరానికి రూ. 5 వేల కరువు సాయం అందించాలి ఎండిన పంటల పరిశీలించిన మాజీ మంత్రి హరీష్ రావు





ముద్ర ప్రతినిధి, మెదక్: తెలంగాణలో ప్రస్తుతం ఉన్నది అతివృష్టి, అనావృష్టి కాదని.. ముమ్మాటికీ రేవంత్ వృష్టి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. నదుల్లో పుష్కలంగా నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ మోటార్లు ఆన్ చేయకుండా పంటలను ఎండబెట్టిన అసమర్థ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమని ధ్వజమెత్తారు. రైతుల సమస్యలను పక్కనపెట్టి గ్లోబల్ సమ్మిట్‌లు, ప్రచార కార్యక్రమాలపై ముఖ్యమంత్రి దృష్టి సారిస్తున్నారని మండిపడ్డారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలప్‌చెడ్ మండలం సంమ్లతండా, ఫైజాబాద్ గ్రామపంచాయతీ పరిధిలోని తుల్య తండా, గంగారం తండాల్లో ఎమ్మెల్యే సునీతా రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలిసి హరీశ్‌రావు పర్యటించారు. ఎండిపోయిన పంటలను పరిశీలించి గిరిజన రైతులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండినా స్పందనేదీ?దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 18 టీఎంసీలే వినియోగించారని, మిగిలిన గోదావరి జలాలను పట్టిసీమ ద్వారా చంద్రబాబుకు వదిలేశారని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. గ్లోబల్ సమ్మిట్‌పై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యలపై ఎందుకు లేదని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు.కొడంగల్‌లో రహదారుల నిర్మాణానికి రూ.9 వేల కోట్లు, ఫ్యూచర్ సిటీకి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి నిధులు ఉంటాయని, కానీ పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి మాత్రం డబ్బులు లేవా అని నిలదీశారు. మహారాష్ట్ర, కర్ణాటక తరహాలో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరానికి రూ.5 వేల చొప్పున కరువు సాయం అందించాలని డిమాండ్ చేశారు.పంటల బీమా ఏమైంది?బడ్జెట్‌లో రూ.1,600 కోట్లు కేటాయించిన పంటల బీమా పథకం ఏమైందని హరీశ్‌రావు ప్రశ్నించారు. మూడేళ్లు గడుస్తున్నా పథకాన్ని అమలు చేయకపోవడం రైతులను మోసం చేయడమేనన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబీమాను నిలిపివేసి, ఇందిరమ్మ బీమా పేరుతో నవంబర్ 19 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించడం రైతులను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు.అసెంబ్లీని అబద్ధాల అడ్డాగా మార్చారని ఆరోపించిన ఆయన.. బడ్జెట్‌లో ప్రకటించిన రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు ఏమైందని ప్రశ్నించారు. రైతుబంధు నిధులు జమ అయినట్లు ముఖ్యమంత్రి పేరుతో రైతులకు నకిలీ సందేశాలు పంపుతున్నారని, ఈ వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే కేసు నమోదు చేసి బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.వడ్ల కొనుగోళ్లలోనూ రైతులకు అన్యాయంకల్లాల్లోకి 30 శాతం ధాన్యం వచ్చినప్పటికీ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేపట్టడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. సన్నధాన్యానికి బోనస్ చెల్లించకుండా ఉండేందుకే కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని విమర్శించారు. రుణమాఫీ పూర్తికాకపోగా రైతుల వృద్ధాప్య పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు, ధాన్యం విక్రయించిన డబ్బులను బ్యాంకులు పంట రుణాల కింద జమ చేసుకుంటున్నాయని పేర్కొన్నారు.సింగూరు జలాశయంలో 20 టీఎంసీల నీటిని మరమ్మతుల పేరుతో ఖాళీ చేసి నాలుగు జిల్లాల ప్రజల గొంతు ఎండబెట్టారని ఆరోపించారు. ప్రజలకు తాగునీరు అందించకుండా బీరు తయారీ పరిశ్రమలకు నీళ్లు ఇస్తారా అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రజాధనం వృథా.. పేదలకు పింఛన్లు ఏవీ?మూసీ సుందరీకరణకు లక్ష కోట్లు, ఫ్యూచర్ సిటీకి లక్ష కోట్లు ఖర్చు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం.. రైతులు, పేదల సంక్షేమానికి మాత్రం నిధులు కేటాయించడం లేదని విమర్శించారు. ఫుట్‌బాల్ కార్యక్రమాలు, అందాల పోటీలు, ఢిల్లీ పర్యటనలు, ప్రత్యేక విమానాల ప్రయాణాలకు నిధులు ఉంటున్నాయని, ప్రజల అవసరాలకు మాత్రం నిధులు లేవని మండిపడ్డారు.ప్రజాపాలనలో పింఛన్ కోసం మూడుసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు ఒక్క పింఛన్ కూడా మంజూరు కాలేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దరఖాస్తులు, జిరాక్స్‌లకే డబ్బులు ఖర్చవుతున్నాయని పేర్కొన్నారు.బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలపై పోస్టులు పెట్టినా, రీట్వీట్ చేసినా చర్యలు తీసుకుంటున్న పోలీసులు.. ముఖ్యమంత్రి పేరుతో లక్షలాది మంది రైతులకు నకిలీ సందేశాలు వెళ్తుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వానికి సంబంధం లేని వ్యవహారమైతే వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.యాసంగి సాగుపై ఆందోళనవచ్చే యాసంగి సీజన్‌లో నీళ్లకు, కరెంటుకు, పంటలకు సెలవు అని ముఖ్యమంత్రి చెబుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. పంటల సాగు నిలిచిపోతే రైతులతో పాటు వ్యవసాయ కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, హార్వెస్టర్ కార్మికులు, రైస్ మిల్లుల కార్మికులు, హమాలీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే ఉపాధి హామీ పనిదినాలను పెంచాలని, కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రకటించిన రూ.12 వేల ఆర్థిక సాయం విడుదల చేయాలని, యాసంగి రైతు భరోసా నిధులను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.రుణమాఫీ కాక.. పుస్తెలతాడు తాకట్టు!నర్సాపూర్ నియోజకవర్గంలోనే 15,910 మంది రైతులకు రుణమాఫీ కాలేదని హరీశ్‌రావు తెలిపారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులు కొత్త రుణాలు ఇవ్వడం లేదని, దీంతో కుటుంబ అవసరాల కోసం భార్య మెడలోని పుస్తెలతాడును తాకట్టు పెట్టి బంగారు రుణం తీసుకోవాల్సి వచ్చిందని బాషా నాయక్ అనే రైతు కన్నీటిపర్యంతమయ్యాడని వివరించారు. రైతుల ఇలాంటి దుస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు.ఈ పర్యటనలో చిలప్‌చెడ్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్ రెడ్డి, కౌడిపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సార రామగౌడ్, ఉపాధ్యక్షుడు బెస్త లక్ష్మణ్, చిలప్‌చెడ్ సర్పంచ్ అనిల్, గౌతాపూర్ సర్పంచ్ బలవంత రెడ్డి, సోమక్కపేట సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, చంద్రగౌడ్, అశోక్ గౌడ్‌తో పాటు పలుపురు సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతలోని ప్రతిభను వెలికితీయాలి



అదనపు కలెక్టర్ నగేష్
ఘనంగా జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు

ముద్ర ప్రతినిధి, మెదక్: యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలు, ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అన్నారు. మెదక్ స్టేడియంలో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను శుక్రవారం అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఉత్సవాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనేలా విస్తృత ప్రచారం కల్పించాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు.యువజన ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద నృత్యాలు, పాటలు, వక్తృత్వ పోటీలు, చిత్రలేఖనం, కవితా రచన తదితర పోటీలు ఏర్పాటు చేశారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి రమేష్, పీడీలు, పీఈటీలు శ్రీనివాస్ రావు, మందుసుధన్ తదితరులు

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి

ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు



ముద్ర ప్రతినిధి, మెదక్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను ఓపికగా విని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం హవేలిఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులో ఛార్జిషీట్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు.స్టేషన్ రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ.. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని, ఫిర్యాదుల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు.సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రతి గ్రామంలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు సూచనలు చేయడంతో పాటు, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు.సీసీటీయన్స్, ఈ –సాక్ష్య, అప్లికేషన్లలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో సీఐలు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఐ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజులు తీసుకుని సర్టిఫికెట్లు నిలిపి వేస్తారా?

నల్ల మల్లారెడ్డి స్కూల్ వ్యవహారంపై గద్వాల విజయలక్ష్మి ఆగ్రహం
10లోగా విద్యార్థినులకు ధ్రువపత్రాలు అందించాలి
ఆర్జేడీకి ఆదేశం
విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించేది లేదు

ముద్ర, హైదరాబాద్:ఫీజులు చెల్లించినప్పటికీ ఇద్దరు మైనర్ విద్యార్థినులకు అకడమిక్ సర్టిఫికెట్లు అందించకుండా వారి చదువుకు ఆటంకం కలిగిస్తున్నారన్న ఫిర్యాదుపై తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి రాష్ట్రస్థాయి ఇన్‌చార్జి గద్వాల విజయలక్ష్మి తీవ్రంగా స్పందించారు. ఘట్‌కేసర్ మండలం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ యాజమాన్యం వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఈ నెల 10వ తేదీలోగా విద్యార్థినులకు అవసరమైన ధ్రువపత్రాలు అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.సీఎం ప్రజావాణిని ఆశ్రయించిన ఇద్దరు బాలికలు తమకు అవసరమైన విద్యా ధ్రువపత్రాలు అందకపోవడంతో తదుపరి చదువులు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యను స్వయంగా తెలుసుకున్న గద్వాల విజయలక్ష్మి వెంటనే పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ సోమిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు.ఫీజులు చెల్లించిన తర్వాత కూడా విద్యార్థుల సర్టిఫికెట్లను ఎందుకు నిలిపివేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాల యాజమాన్య వైఖరి కారణంగా పిల్లల చదువు ఆగిపోయే పరిస్థితి రావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీలోగా విద్యార్థినులకు అవసరమైన సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీకి తేల్చిచెప్పారు.విద్యాసంస్థలపై కఠిన చర్యలు తప్పవుఈ సమస్య పరిష్కారం కాకపోతే పూర్తి వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని గద్వాల విజయలక్ష్మి హెచ్చరించారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు అధికారికంగా లేఖ కూడా రాశారు. విద్యార్థినులకు అవసరమైన ధ్రువపత్రాలను వెంటనే అందజేయడంతో పాటు, వారు చేసిన వేధింపుల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఫీజులు లేదా ఇతర పరిపాలనా సమస్యల పేరుతో విద్యార్థుల చదువును అడ్డుకోవడం సహించబోమని ఆమె స్పష్టం చేశారు. విచారణలో పాఠశాల యాజమాన్యం తప్పిదం నిర్ధారణ అయితే సంబంధిత విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతానన్నారు.రాష్ట్రంలోని ఇతర విద్యాసంస్థలు కూడా ఈ వ్యవహారాన్ని గమనించాలని సూచించారు. విద్యార్థులను వేధించడం, అకడమిక్ సర్టిఫికెట్లను నిలిపివేయడం, వారి విద్యాభ్యాసానికి ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడితే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు.పిల్లల చదువు మధ్యలో ఆగిపోకుండా చూడటం ప్రభుత్వ బాధ్యతని, వారి విద్యా హక్కులు, భవిష్యత్తు విషయంలో సీఎం ప్రజావాణి రాజీపడబోదని గద్వాల విజయలక్ష్మి స్పష్టం చేశారు.83 ఫిర్యాదులు స్వీకరణకాగా, శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 83 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

నేలకొండపల్లిలో ప్రాచీన మానవ నివాస ఆనవాళ్లు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 6 : నేలకొండపల్లి సమీపంలోని బైరాగులగుట్ట, మొర్లకొండ వాగు పరిసరాల్లో ప్రాచీన మానవ నివాసానికి సంబంధించిన విలువైన పురావస్తు ఆధారాలు వెలుగులోకి వచ్చాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. తెలంగాణ వారసత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్షేత్రస్థాయి అన్వేషణ ప్రాంతాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సర్వేలో నాటి ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే మట్టి పూసలు, రాతి రోకలి, బండి చక్రం, పలు రకాల మృణ్మయ పాత్రల పెంకులు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. వీటిపై ఉన్న బొటనవేలి ముద్రలు, పౌరాణిక, పుష్పాలంకరణలు ఆనాటి కళాత్మక నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయని తెలిపారు. బైరాగులగుట్ట పరిసరాల్లో రెండు ప్రాచీన ఇటుక నిర్మాణాల అవశేషాలను కూడా పురావస్తు బృందం గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ అన్వేషణలో సేకరించిన ఆధారాలు నేలకొండపల్లి ప్రాచీన చరిత్రను, సంస్కృతిని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో వారసత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి. నాగరాజు, నేలకొండపల్లి తహసీల్దార్ రాంప్రసాద్, పర్యాటక, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ భూములను అమ్మొద్దు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
రూ.2,000 కోట్ల విలువైన హౌసింగ్ బోర్డు స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది
ప్రజల అవసరాలకు వాడాల్సిన భూములను విక్రయిస్తే ఊరుకోం
కూకట్‌పల్లి ఎమ్మెల్యే హెచ్చరిక
రేవంత్ రెడ్డి పర్యటనలను, టెండర్లను అడ్డుకుంటామని స్పష్టీకరణ

ముద్ర, కూకట్‌పల్లి : కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడాన్ని నిరసిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం కేపీహెచ్‌బీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలించడం మరచి, ప్రభుత్వ భూములను అమ్ముకోవడమే ధ్యేయంగా పనిచేస్తోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి మరియు కేపీహెచ్‌బీ పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుమారు రూ.2,000 కోట్లు కేటాయించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఈ నిధులతో మహిళా పార్కులు, చిల్డ్రన్ పార్కులు, ఇండోర్ స్టేడియాలు, అత్యాధునిక క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించామన్నారు. గతంలో మియాపూర్ భూముల విషయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్మకానికి పెట్టడం దారుణమని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఆసియాలోనే అతిపెద్ద కాలనీలలో ఒకటైన కేపీహెచ్‌బీలో పెరిగిన జనాభాకు అనుగుణంగా ఫైర్ స్టేషన్, పెట్రోల్ బంకు వంటి అత్యవసర సౌకర్యాల కోసం కేటాయించాల్సిన భూములకు కూడా టెండర్లు పిలవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతమ్ తీరును ఆయన తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ హౌసింగ్ బోర్డు స్థలాలను అమ్ముకోవడానికే ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు.ప్రస్తుతం నగరంలో తాగునీరు, విద్యుత్ కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం వాటిని పరిష్కరించడం మరచిపోయిందని దుయ్యబట్టారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాలపై కనీస అవగాహన లేకుండా కాంగ్రెస్ నాయకులు నిర్ణయాలు తీసుకుంటున్నారని, కొంతమంది "అలీబాబా అరడజను దొంగల" మాదిరిగా భూముల అమ్మకాలే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భూముల వేలాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, విలేకరులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు.హౌసింగ్ బోర్డు భూముల టెండర్లను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలను మరియు టెండర్ల ప్రక్రియను అడ్డుకుంటామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. ప్రాణాలు పోయినా సరే, పార్టీలకు అతీతంగా ప్రజలను సమీకరించి ప్రభుత్వ ఆస్తులను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555